

కందుకూరు మున్సిపాలిటీకి ఎన్నికలు?


- మే, జూన్‌లో నిర్వహణకు సన్నాహాలు
- సీఎం పర్యటన ఉద్దేశం అదేనా!?

- వివరాలు 6లో..

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

జిల్లా వార్తలు

మంగళవారం 18 ఫిబ్రవరి 2025

పేదల ఆసుపత్రుల్లో అత్యవసర మందులు కరువయ్యాయి. వైద్యశాలల్లో ఉన్న మందులనే డాక్టర్లు రోగులకు ఇస్తున్నారు. ఫలానా మందులు కావాలని రోగులు అడిగితే బయట కొనుగోలు చేసుకోమంటూ ఉచిత సలహా ఇస్తున్నారు. నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలతోపాటు ఆత్మకూరు, కావలి, కందుకూరులలోని ప్రధాన ఆసుపత్రులను సోమవారం 'ఆంధ్రజ్యోతి' బృందం విజిట్ చేసింది.

మందుల్లేవ్.. ఇన్సులిన్ సూదుల్లేవ్!

- పేదల ఆసుపత్రుల్లో ఇదీ పరిస్థితి



నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాకే తలమానికంగా ఉన్న నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో (జీజీహెచ్) మందుల కొరత తీవ్రంగా ఏర్పడింది. అత్యవసర మందులు సరఫరా కాకపోవడంతో పేద రోగులపై భారం పడుతోంది. జీజీహెచ్‌కు రోజుకు 1200 మంది రోగులు వస్తుండగా, 500 మంది వరకు ఇన్‌పేషెంట్లుగా చికిత్స పొందుతుంటారు. హిమోఫిలియా రోగులకు ఇచ్చే ఫ్యాక్టర్ ఇంజక్షన్‌లు ఇక్కడ లేవు. అలాగే మధుమేహ బాధితులకు ఇచ్చే నాలుగు రకాల ఇంజక్షన్ల కొరత కూడా ఉంది. ప్రభుత్వ వీటిని సరఫరా చేయక పోవటంతో జీజీహెచ్ అధికారులే కొనుగోలు చేస్తున్నారు. అది కూడా ఒక రకానికి చెందిన ఇన్సూలిన్ మాత్రమే. టెనిలింగ్లిప్టిన్ మాత్రలు కూడా సరఫరా కావటం లేదు. మల్టీవిటమిన్ ట్యాబ్లెట్‌లు రాస్తే వాటికి బదులు బీ కాంప్లెక్స్ మాత్రలు ఇస్తున్నారు. కంటికి సంబంధించి కొన్ని రకాల చుక్కల మందులను బయట కొనుక్కోమని చీటీ రాసిస్తున్నారు. కొన్ని యాంటీబయాటిక్ మందులు కూడా రోగులు బయటే కొనుగోలు చేస్తున్నారు.

ఆత్మకూరులో స్లిప్పుల్లేవ్!

ఆత్మకూరు : పట్టణంలోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో పాన్‌టాప్, బీకాంప్లెక్స్ మందులు అందుబాటులో లేవు. పాన్‌టాప్ బదులు రాన్‌టిడిన్ ఇస్తుండటంతో కొంత ఉపయుక్తంగా ఉంది. కాగా, డాక్టర్లు రాసిచ్చే మందుల చీటీల కొరతతో (స్లిప్పులు) రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. రోగులను డాక్టర్లు పరిశీలించి అవసరమైన మందులను కార్బన్ పేపరు పెట్టి రెండు చీటీలను రోగులకు రాసివ్వాలి. ఒక చీటీని ఫార్మసిస్టు వద్ద ఉంచుకుని రికార్డులో నమోదు చేసుకుంటారు. మరో చీటీ రోగుల వద్ద ఉంటుంది. కానీ స్లిప్‌ల కొరతతో డాక్టర్లు ఒక మందుల చీటీని మాత్రమే రాసిస్తున్నారు. ఫార్మసిస్టు ఆ చీటీని తీసుకుని తన వద్దనే ఉంచుకుంటున్నారు. దీంతో రోగులు ఆ మాత్రలను ఏ సమయంలో మింగాలో అర్థం కావడం లేదు. దీనికితోడు జబ్బు నయంకాని రోగులు తిరిగి డాక్టర్ల వద్దకు వస్తే ఏం మందులు వాడారో తెలియక ఇబ్బంది పడుతున్నారు.



ఆత్మకూరులోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో కౌంటర్ వద్ద మందుల తీసుకుంటున్న రోగులు

ఇన్సులిన్ లేదన్నారు!

మధుమేహ వ్యాధికి ఇన్సులిన్ కోసం జీజీహెచ్‌కి వెళితే అందుబాటులో లేవని చెప్పారు. విధిలేని స్థితిలో బయట కొనుగోలు చేస్తున్నా. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల ఇన్సులిన్లను అందుబాటులో ఉంచాలి.

- వెంకటేశ్వర్లు

మందుల కొరత ఉంది

జీజీహెచ్‌లో మందుల కొరత ఉంది. చాలా వ్యాధులకు బయట కొనుగోలు చేయాలని వైద్యులు రాస్తున్నారు. ప్రభుత్వ నుంచి ఆశించిన స్థాయిలో మందులు రాకపోవటంతో అత్యవసర మందులను లోకల్‌గా కొనుగోలు చేస్తున్నాం.

- నరేంద్ర, జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్

కావలిలో సిరప్‌ల్లేవ్!

కావలి (టౌన్) : కావలి ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో షుగర్‌కు సంబంధించి రెండు రకాల మందులు అవసరం కాగా ఒక రకం మాత్రమే ఏపీ పేషంట్లకు ఇస్తున్నారు. వీటి కోసం ఇండెంట్ పెట్టగా అవి ఖరీదైనవి కావటంతో ఇంకా సరఫరా కాలేదు. అలాగే కొన్ని యాంటీ బయటిక్ సిరప్‌లు కూడా అందుబాటులో లేవు. వైద్యశాలలో అందుబాటులో ఉన్న మందులను మాత్రమే రాసిస్తుండటంతో రోగులు బయట కొనాల్సిన పనిలేదు. మంచి మందులు కావాలని అడిగిన వారికి మాత్రం బయటకొనుగోలు చేసుకోమని రాసిస్తున్నారు.

- కందుకూరు : స్థానిక ఏరియా వైద్యశాలలో అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయి. కొన్ని రకాల మందులకు ప్రత్యామ్నాయంగా మార్కెట్లో ప్రాచుర్యం పొందిన మందులను మాత్రం పేషెంట్లు కోరుకుంటే బయటకు రాస్తున్నామని వైద్యాధికారులు వివరించారు. అంతకు మినహా ఎలాంటి మందుల కొరత లేదని వివరించారు.

ఇమ్యునోగ్లోబలిన్ ఇంజక్షన్లు ఏవీ?

గులియన్ బారే సింగ్రోమ్ (జీబీఎస్) కేసులు రాష్ట్రవ్యాప్తంగా నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో జీజీహెచ్‌లో తప్పనిసరిగా ఇమ్యునోగ్లోబలిన్ ఇంజక్షన్‌లు అందుబాటులో ఉండాలి. అయితే రాష్ట్ర వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) వీటిని సరఫరా చేయటం లేదు. మరోవైపు మానసిక వ్యాధులకు కూడా అత్యసర మందులు లేకపోవటంతో వైద్యులు బయట కొనుగోలు చేయాలని రాస్తున్నారు. గుండెపోటు బాధితులకు తక్షణం ఇవ్వాల్సిన టెనెక్టెప్లేస్ ఇంజక్షన్ అందుబాటులో ఉంది. పక్షవాత రోగులకు కూడా ఈ ఇంజక్షన్‌ను వినియోగిస్తున్నారు. మిగిలిన వ్యాధులకు తక్షణం అందించాల్సిన మందులూ జీజీహెచ్‌లో లభించడం లేదు.

గులియన్ గుబులు!!

- జిల్లా వాసులను భయపెడుతున్న జీబీఎస్
- జీజీహెచ్‌లో ఏడాది కాలంలో 20 కేసులకు చికిత్స
- కానీ కేసులే లేవంటున్న వైద్య శాఖ!
- ఇమ్యునోగ్లోబలిన్ ఇంజక్షన్ల సరఫరా ఆపేసిన ప్రభుత్వం
- రోగులకు రూ.4 లక్షల నుంచి రూ. 12 లక్షల వరకు ఖర్చు
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయమే

గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) వ్యాధి జిల్లా వాసులను భయపెడుతోంది. వైద్య ఆరోగ్యశాఖ జిల్లాలో జీబీఎస్ కేసులు ఏమీ నమోదు కావటం లేదని చెబుతున్నప్పటికీ ఏడాది కాలంగా నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 20 మంది జీబీఎస్ వ్యాధిగ్రస్థులకు చికిత్స అందచేయటం గమనార్హం. ప్రస్తుతం వారంతా ఆరోగ్యంగా ఉన్నారు. తాజాగా జీబీఎస్ అనుమానంతో ఓ వ్యక్తికి జీజీహెచ్‌లో వైద్యం చేస్తున్నారు. అయితే ఈ వ్యాధి చికిత్సకు అవసరమైన ఇమ్యునోగ్లోబలిన్ ఇంజక్షన్ జీజీహెచ్‌లో అందుబాటులో లేకపోవటంతో వైద్య నిపుణులు రోగులను ప్రైవేట్ ఆసు పత్రులకు సిఫార్సు చేస్తున్నట్లు తెలిసింది. ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలోనూ ఈ వ్యాధికి చాలా తక్కువ మొత్తంలో చెల్లింపులు ఉండటం తో ఆసుప త్రులు రోగుల నుంచి అదనంగా వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం.

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఇటీవల కాలంలో జీబీఎస్ వ్యాధి కారణంగా రెండు మరణాలు సంభవించడంతో పదుల సంఖ్యలో బాధితులు ఆసుపత్రుల్లో చేరడంతో జిల్లా వాసుల్లో 'గులియన్' గుబులు పట్టుకుంది. ఈ వ్యాధి సోకితే కాళ్ల నుంచి నడుము, మెదడు వరకు నరాలు చచ్చుబడి కదల్లేని పరిస్థితి వచ్చే అవకాశం ఉంది. ఈ వ్యాధి జిల్లాలో చాపకంద నీరులా వ్యాపిస్తోందని అంచనా. ప్రస్తుతం జీజీహెచ్‌తోపాటు పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లోనూ వ్యాధిగ్రస్తులు చికిత్సలు పొందుతున్నారు. దీని నుంచి కోలుకునేందుకు నెల నుంచి ఆరు నెలల వరకు సమయం పడుతోందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో బాధితులు రూ.లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది. వ్యాధిపై ఎలాంటి నిర్లక్ష్యం వహించినా ప్రాణాలు పోయే ప్రమాదం ఉన్నట్లు వైద్య నిపుణులు వెల్లడిస్తున్నారు.

ప్రైవేట్ ఆసుపత్రులే దిక్కు

జీబీఎస్‌కు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పూర్తిస్థాయిలో వైద్య చికిత్సలు అందుబాటులో లేకపోవడంతో రోగులకు ప్రైవేటు ఆసుపత్రులే దిక్కవు తున్నాయి. ప్రస్తుతం వ్యాధిగ్రస్తు లు నెల్లూరులోని కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నారు. వ్యాధికి అవసరమైన ఇమ్యునోగ్లోబిలిన్ ఇంజక్షన్ ఒక గ్రాము ఖరీదు రూ. 11వేలుగా ఉంది. వ్యాధిగ్రస్తునికి రోజుకు 5 ఇంజక్షన్లు ఇవ్వాలి. దీంతోపాటు ప్లాస్మాపెరోసిస్ చికిత్స చేస్తారు. ఆ చికిత్సకు ఒక్క సైకిల్‌కు రూ.లక్ష ఖర్చు అవుతుందని వైద్యులు చెబుతు న్నారు. దీంతో బాధితుని కండిషన్‌ను బట్టి రూ.4 లక్షల నుంచి రూ. 8 లక్షల వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది.

జీజీహెచ్‌లో నిర్ధారణ పరీక్షలు నిల్?

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గులియన్ బారో సింగ్రోమ్ వ్యాధిని నిర్ధారించే ఈఎన్ఎంజీ, ఎన్‌సీఎస్ పరీక్షలు చేయటం లేదు. అనుమానితులను ఈ పరీక్షల కోసం బయటకు పంపుతున్నారు. దీంతో బాధితులు వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. వ్యాధి నిర్ధారణకు అవసరమైన పరికరాల కోసం జీజీహెచ్‌కు కేవలం రూ. 5 లక్షలు మంజూరు చేస్తే ఈ పరీక్షలు చేయవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. అయి తే ప్రభుత్వం నిధులు విడుదల చేయకపో వటంతో రోగులకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు.

వ్యాధి లక్షణాలు

- జీబీఎస్ వ్యాధి సోకిన వారు బలహీనంగా ఉంటారు.
- నడిచేటప్పుడు విపరీతమైన అలసటకు గురవుతారు.
- ఊపిరితీసుకునే కండరాలు బలహీనపడతాయి.
- మెదడు నుంచి శరీరమంతా ప్రయాణించే నరాలకు చెందిన మైలిన్ పొర దెబ్బతిని నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది.
- దీనివల్ల మాట్లాడేటప్పుడు, నడిచేటప్పుడు స్థిరత్వం ఉండదు.
- గుండె స్పందనలు లయ తప్పుతాయి. జీర్ణశక్తి మందగిస్తుంది.
- కండరాల నొప్పి, ఒళ్లంతా తిమ్మిరెక్కడం
- కాళ్లు చచ్చుబడి నడవలేక పోవటం
- పొత్తి కడుపు నొప్పి, డయేరియా. జ్వరం, వాంతులు, నీరసం
- రోగి నిరోధక శక్తి తగ్గటం



ముందస్తు జాగ్రత్తలు

- కలుషిత ఆహారం తీసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- ఇన్‌ఫ్లూయెంజా, టెటనస్ వంటి టీకాలపై అప్రమత్తంగా ఉండాలి
- చిన్నపాటి కాళ్లనొప్పులు, తిమ్మిర్లు ఉన్నా వెంటనే వైద్యులను కలవాలి
- ఈ వ్యాధి సోకిన ఒకట్రెండు వారాల తర్వాత బయటపడే అవకాశం ఉంది.
- వెంటనే నరాల వ్యాధి నిపుణులను సంప్రదించి చికిత్స చేయించుకుంటే 4 వారాల్లో కోలుకునే అవకాశం ఉంది. వ్యాధి ముదిరితే కోలుకోవటానికి 6 నెలలు పట్టవచ్చు.

కొన్ని కేసులు పరిశీలిస్తే...

- నెల్లూరు రూరల్ మండలం వడ్డిపాళేనికి చెందిన ప్రశాంత్ (పేరు మార్చాం) అనే యువకుడికి రెండు నెలల క్రితం కాళ్లు చచ్చుబడి పోయా యి. క్రమేపి తిమ్మిర్లు వచ్చాయి. బాధితుడు నడవలేక పోవటంతో చెన్నై విజయ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ అన్నీ పరీక్షలు నిర్వహించి జీబీఎస్ వ్యాధిగా నిర్ధారించి చికిత్స చేశారు. వైద్యుల పర్యవేక్షణ కోసం నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ఇప్పటి వరకు రూ.12 లక్షల వరకు ఖర్చు చేయాల్సి వచ్చింది.
- నెల్లూరులోని పొదలకూరు రోడ్డు పద్మావతి నగర్‌కు చెందిన 23 ఏళ్ల ఓ బ్యాంక్ ఉద్యోగినికి కాళ్ల నరాలు చచ్చుబడ్డాయి. దీంతో నగరంలోని ఓ న్యూరో స్పెషాలిటీ ఆసుత్రికి వెళ్లింది. అక్కడ వైద్యులు జీబీఎస్‌గా గుర్తించి వైద్య చికిత్సలు అందించటంతో ఆమె కోలుకున్నారు.
- నవలాకుల గార్డెన్‌కు చెందిన సాయి అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బెంగళూరులో ఉన్నారు. డిసెంబర్ నెలలో కాళ్లు తిమ్మిరెక్కి నడవలేని స్థితికి వచ్చారు. దీంతో నగరంలోని ఓ న్యూరాలజిస్ట్ వద్ద చికిత్స చేయించుకుని కోలుకున్నారు. ఈ యువకునికి కూడా జీబీఎస్ వ్యాధిగా నిర్ధారణ అయి వైద్య ఖర్చుల కోసం రూ. 6 లక్షలు ఖర్చు పెట్టాల్సి వచ్చింది.
- నగరంలోని ఓ ఎలక్ట్రానిక్ మీడియా చానల్‌కు చెందిన యువకుడు నగరంలోని ఓ న్యూరో స్పెషాలిటీ వైద్యశాలలో జీబీఎస్ వ్యాధికి చికిత్స చేయించుకున్నారు. ఇందుకు రూ. 6 లక్షలు ఖర్చయింది. అదే చానల్‌లో పనిచేస్తున్న ఓ ఉద్యోగి కుటుంబంలోని 8వ తరగతి విద్యార్థి జీబీఎస్ బారిన పడటంతో తల్లిదండ్రులు హైదరాబాద్‌కు తీసుకెళ్లి చికిత్స చేయించా రు. ప్రస్తుతం వారంతా కోలుకున్నారు.

జీజీహెచ్‌లో 20 మందికి చికిత్స



గత ఏడాది కాలంలో 20 మంది గులియన్ బారే సింగ్రోమ్ బాధితులకు వైద్య చికిత్సలు విజయవంతంగా నిర్వహించాము. వ్యాధికి సంబంధించి అవసరమైన ఇమ్యునోగ్లోబలిన్ ఇంజక్షన్ కూడా ప్రభుత్వ సరఫరా చేయటంతో ఈ చికిత్సలు అందించటం జరిగింది. ప్రస్తుతం ఈ ఇంజక్షన్ సరఫరా ఆగిపోవటంతో వ్యాధిగ్రస్తులకు అవసరమైన చికిత్సలు పూర్తి స్థాయిలో అందించ లేకపోతున్నాము. వ్యాధి నిర్ధారణకు రూ.5 లక్షలు ఖర్చు చేస్తే ఈఎన్ఎంజీ, ఎన్‌సీఎస్ పరీక్షలు చేసే వీలుంటుంది.

- డాక్టర్ నరేంద్ర, జీజీహెజ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్

అధ్యాపకుడి నుంచి ఆర్థిక నేరస్థుడిగా..

షేక్ మహబూబ్ సుభానీ... అధ్యాపకుడిగా ప్రస్థానం ఆరంభమై ఆర్థిక నేరస్థుడిగా ముగిసింది. డబ్బుమీద వ్యామోహంతో పేదల కష్టార్జితాన్ని స్వాహా చేశాడు. షేర్ మార్కెట్ల పేరుతో తెలుగురాష్ట్రాల్లో రూ.కోట్లు వసూలు చేసి పరారీలో ఉన్న సుభానీని కావలి పోలీసులు అరెస్ట్ చేశారు. తీగ లాగితే డొంకంతా కదిలినట్టు సుభానీపై జరిపిన విచారణలో పోలీసులకే దిమ్మతిరిగే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఆ వివరాలు...

పేదల ధనాశే పెట్టుబడిగా స్కాం

- 'అనంతార్థ' నిర్వాహకుడు సుభానీ అరెస్ట్
- రూ.11.39 కోట్ల ఆస్తులు, నగదు సీజ్
- 150 మంది ఫిర్యాదు మేరకు రూ.25 కోట్ల సొమ్ము దోపిడీ
- ఎవరినీ వదిలే ప్రసక్తే లేదంటున్న పోలీసులు



మనీస్కాం గురించి వివరాలు వెల్లడిస్తున్న కావలి డీఎస్పీ శ్రీధర్, వెనుక నిందితులు (ముసుగులో ఉన్న వ్యక్తులు)

కావలి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో తెలుగు రాష్ట్రాల్లో ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న ఓ మోసగాడిని శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. కావలి డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ పీ.శ్రీధర్, కావలి రూరల్ సీఐ రాజేశ్వరరావు, సీఐలు ఫిరోజ్, గిరిబాబులు ఆర్థిక నేరగాడు షేక్ మహబూబ్ సుభానీ అరెస్ట్ వివరాలను వెల్లడించారు.

మూడు చోట్ల కేసులు...

బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ సుభానీ విజయవాడలో ఎంసీఏ పూర్తి చేసి కొంతకాలం నరసరావుపేటలో కంప్యూటర్ అధ్యాపకుడిగా పనిచేశారు. అనంతరం నెట్‌వర్క్ మార్కెటింగ్‌లోకి వచ్చి షేర్‌మార్కెటింగ్, ట్రేడింగ్ మీద అవగాహన పెంచుకున్నారు. 2014లో కాకినాడలో ఆన్‌లైన్ ట్రేడ్ మార్కెటింగ్ స్థాపించి తన నెట్‌వర్క్‌ను విస్తరింపజేసుకున్నారు. తన ఏజెంట్ల ద్వారా కోట్ల రూపాయల ప్రజల సొమ్ము దోపిడీ చేసి అక్కడ నుంచి పరారవడంతో కాకినాడ పోలీస్‌స్టేషన్‌లో సుభానీపై చీటింగ్ కేసు నమోదైంది. ఆ తర్వాత తెలంగాణలోని మక్తల్‌కు చేరుకుని చెప్పులు, ఫర్టిలైజర్స్, బంగారం వ్యాపారం కొంతకాలం చేశారు. మక్తల్‌లో కూడా కాకినాడలాగా ఆన్‌లైన్ మార్కెటింగ్ పేరుతో భారీగా నగదు వసూలు చేసి పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు మక్తల్‌లోనూ రెండు కేసులు నమోదయ్యాయి. పోలీస్‌లకు దొరక్కుండా అక్కడ నుంచి శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలోని ముసునూరుకు చేరుకున్నాడు. ఇక్కడ 17 మంది సభ్యులతో 'అనంతార్థ' అసోసియేట్స్ పేరుతో ఏజెన్సీ స్థాపించారు. ఇక్కడా మూడున్నర సంవత్సరాలుగా అధిక వడ్డీలు, రకరకాల ఆఫర్లతో మోసాలకు పాల్పడి పోలీస్‌లకు చిక్కాడు. ఇలా పదేళ్లుగా పోలీసులకు దొరకకుండా ప్రజలను చీటింగ్ చేస్తున్న సుభానీని కావలి పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ స్కాంలో సభ్యులతోపాటు ప్రత్యక్ష, పరోక్ష సంబంధాలున్న ఎంతటివారినైనా వదిలే ప్రసక్తేలేదని పోలీసులు తెలిపారు.

2021, నవంబరులో కావలి ముసునూరులో 17 మంది సభ్యులతో అనంతార్థ అసోసియేట్స్ అనే ఏజెన్సీని సుభానీ స్థాపించి ప్రజలకు అధిక వడ్డీలు, ప్రత్యేక ఆఫర్లు చూపిస్తూ భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారు. దీంతో గత నెలలో మందాటి ప్రభాకర్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుభానీపై కేసు నమోదు చేశారు. అప్పటినుంచి తప్పించుకుని తిరుగుతున్న సుభానీని ఆదివారం రాత్రి 10.30 గంటలకు కావలి రూరల్ మండలం గౌరవరం జాతీయ రహదారి వద్ద అనుచరుడు యలసిరి బ్రహ్మానందంతోపాటు అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. ఈ స్కాం లావాదేవీలకు సంబంధించి బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.5,35,92,126 సీజ్ చేయడంతోపాటు రూ.5,74,51,000 విలువ గల ఆస్తులను గుర్తించారు. అలాగే రూ.28,48,600 నగదును కూడా సీజ్ చేసారు. ఇప్పటివరకు 150 మంది బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూ.25 కోట్ల వరకు ప్రజల సొమ్ము దోపిడీ జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఇంకా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల మేరకు ఆ సొమ్ము మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని డీఎస్పీ చెబుతున్నారు.

అనంతార్థ సభ్యులు వీరే

అనంతార్థ అసోసియేట్స్ ఏజెన్సీ సంస్థ సభ్యుల పేర్లను పోలీసులు వెల్లడించారు. నిర్వాహకుడు షేక్ మహబూబ్ సుభానీ, దీపలపూడి కమలకుమార్, చలంచర్ల అనీల్, పిల్లి సామ్రాజ్, యలసిరి బ్రహ్మానందం, గోనె కిరణ్, యలసిరి ఆదినారాయణ, తలపల శివశంకర్, అబ్బూరి శీనయ్య, చౌటూరి అశోక్, నిమ్మగడ్డ రామ్ రామ్ రహీం, కాకాణి ప్రశాంతి, కానిస్టేబుల్ రాధాకృష్ణయ్య భార్య వట్టికాల ప్రశాంతి, వీ.శివాజుల, కశెట్టి పుష్పలత, కానిస్టేబుల్ అయోధ్య భార్య జ్యోతి స్రవంతి, గుళ్లమూడి వంశి రెడ్డి సంస్థలో సభ్యులుగా ఉన్నట్లు తెలిపారు.

నేటి నుంచి బడిలో భాషల పండుగ

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం (21న) సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో భాషల పండుగ నిర్వహణకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 18 నుంచి 21వ తేదీ వరకు పలు భాషలకు సంబంధించి వివిధ పోటీలు నిర్వహించేలా మార్గదర్శకాలు జారీ చేసింది. జిల్లాలోని 345 పాఠశాలల్లో మంగళవారం నుంచి భాషల పండుగ కార్యక్రమాలను నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. దీనికోసంగా ఒక్కో పాఠశాలకు రూ.500 చొప్పున రూ.1.72 లక్షలు విడుదల చేశారు. ఎంపిక చేసిన భాషలకు సంబంధించి ఆయా తేదీల్లో పఠనం, పొట్టి కథలు చెప్పడం, రాయడం, చర్చావేదిక, వక్తృత్వం, ఉపన్యాసం, స్పెల్‌చెక్, రోల్‌ప్లే, బోధనోపకరణాల తయారీ వంటి అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తారు. సంస్కృతంలో శ్లోకాలు, ఉర్దూలో గజల్స్ చెప్పడానికి అవకాశం కల్పిస్తారు. సంప్రదాయ నృత్యాలు, పాటలు, ఆటలు నిర్వహిస్తారు. డిప్యూటీ ఈఓలు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎస్ఏ అధికారులంతా షెడ్యూల్ ప్రకారం భాషా ఉత్సవాలు నిర్వహించేలా ఆదేశాలు ఇచ్చినట్లు డీఈవో బాలాజీరావు తెలిపారు.

అక్రమాలు నిజమే!

పెరంకొండలో విజిలెన్స్ విచారణ పూర్తి

భారీగా అవినీతి జరిగినట్లు నిర్ధారణ!

నెల్లూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : సుమారు రూ.వంద కోట్ల ప్రజాధనాన్ని పరిహారం రూపంలో స్వాహా చేసిన 'పెరంకొండ' ముంపు వ్యవహారం ఫైనల్ దశకు చేరుకుంది. రెండు నెలలపాటు జరిగిన విజిలెన్స్ విచారణ పూర్తయింది. ఇక ప్రభుత్వానికి నివేదిక సమర్పించడమే మిగిలింది. నాడు జాయింట్ కలెక్టర్ విచారణలో తేలిన అక్రమాలకంటే విజిలెన్స్ విచారణలో మరిన్ని అక్రమాలు బట్టబయలైనట్లు సమాచారం. 2023లోనే అప్పటి జేసీ రోణంకి కూర్మనాథ్.. ఈ ముంపు అక్రమాలపై సుదీర్ఘ విచారణ చేసి అక్రమాలు నిగ్గు తేల్చారు. ఈ గ్రామం ముంపు కిందకు వస్తుంది అనుకున్నా పరిహారం చెల్లింపులో అక్రమాలు జరిగాయని, సుమారు రూ.33 కోట్లకుపైగా ప్రజాధనం పక్కదారి పట్టిందని ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. అప్పట్లో అక్రమార్కులు ఈ నివేదికపై తదుపరి చర్యలు లేకుండా డబ్బులు వెదజల్లి అడ్డుకున్నారు. కానీ కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టాక ఈ నివేదికను విజిలెన్స్‌కు అప్పగించింది. మరింత లోతుగా విచారణ జరిపి నివేదిక అందించాలని ఆదేశించింది. అయితే ఇప్పుడు విజిలెన్స్ విజిలెన్స్ విచారణలో పెరకొండ గ్రామంలో ఒక్క కాలనీ మినహా మిగిలిన ఊరు ముంపు కిందకు రాదని తేల్చినట్లు తెలిసింది. డీజీపీఎస్ సర్వేను చేసి కండలేరు కాంటూర్‌ను నిర్ణయించిన తర్వాత ఈ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. దీంతో దోపిడీ జరిగిన ప్రజాధనం విలువ మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి.

కూరగాయలను మార్కెట్ ధరకే అమ్ముకోండి

నెల్లూరు (వ్యవసాయం), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సాగవుతున్న కాయగూరలకు సరైన ధర లేకపోతే మార్కెట్ ధరకే రైతు బజార్లలో నేరుగా అమ్ముకునేలా ఉన్నతాధికారులు అవకాశం కల్పించినట్లు మార్కెటింగ్ ఏడీ అనితకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యాన శాఖ, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శులను కలిసి వివరాలు తెలియజేయాలని తెలిపారు. తద్వారా ఆయా రైతులకు సమీప రైతుబజార్లలో నేరుగా అమ్ముకునే అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. ఏమైనా సందేహాలకు 9182361352 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

21న కందుకూరులో సెమినార్

కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 21న జిల్లాస్థాయి క్రాప్ సెమినార్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉద్యానశాఖాధికారి సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెమినార్‌లో యూనివర్సిటీ శాస్త్రవేత్తలు పాల్గొని మామిడి సాగు, పురుగులు, తెగుళ్లపై రైతులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మామిడి కోత అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.



డెల్టాకు 2300 క్యూసెక్కుల విడుదల

అనంతసాగరం ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): డెల్టా ప్రాంతానికి సోమశిల జలాశయం నుంచి 2300 క్యూసెక్కుల నీటిని సోమవారం విడుదల చేశారు. కాగా, ఎగువ నుంచి 1,197 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, డ్యాంలో 62.652 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,800, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. అలాగే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 6వ నెంబరు క్రస్ట్‌గేట్ ఎత్తి నీటిని విడుదల చేశారు. దీంతో కలువాయి, నెల్లూరు, సోమశిలకు రాకపోకలు ఆగిపోయాయి. 11, 12 క్రస్ట్‌గేట్ల రోప్‌లు సక్రమంగా లేని కారణంగా ఈ నిర్ణయం తీసుకొన్నట్లు ఇంజనీర్లు తెలిపారు.

కండలేరులో 53.06 టీఎంసీల నీరు

రాపూరు : కండలేరు డ్యాంలో 53.06 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సోమశిల, ఇతర కాలువల నుంచి ఇన్‌ఫ్లో వస్తుండగా, 1,135 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

ఘటిక సిద్ధేశ్వరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తా

● ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్, కూటమి పార్టీల నాయకులు

ఉదయగిరి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన ఘటిక సిద్ధేశ్వరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. సోమవారం ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ఘటికసిద్ధేశ్వరం, భైరకోన క్షేత్రాలకు ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు, కూటమి నాయకులతో కలిసి బస్సును జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం డ్రైవర్ సీటులో కూర్చొని స్టీరింగ్ తిప్పారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఘటిక సిద్ధేశ్వ రంపై అభివృద్ధిపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామన్నారు. ఈనెల 26న మహా శివరాత్రి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించామన్నారు. అనంతరం సీహెచ్‌సీని తనిఖీచేశారు. రోగులకు అత్యవసర వైద్యసేవలు సైతం అందేలా చూడాలని వైద్యులకు సూచించారు. ఆ తర్వాత టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, గూడూరు వెంకటేశ్వరావు నివాసాలకు వెళ్లి యోగక్షేమాలు తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బయ్యన్న, రియాజ్, బొజ్జా శ్రీనివాసులు, గడ్డం శ్రీనివాసులు, కదిరి వెంకటరంగారావు, ముడమాల రమేష్‌రెడ్డి, నెల్లూరు వెంకటస్వామి నాయుడు, మేకపాటి మాల్యాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

ఎన్‌సీడీ సర్వేను పటిష్టంగా నిర్వహించాలి

● లేకుంటే కఠిన చర్యలు : డీఎంహెచ్‌వో

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పీహెచ్‌సీల వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది ఎన్‌సీడీ సీడీ 3.0 సర్వేను పటిష్టంగా నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత ఆదేశించారు. డీఎంహెచ్‌వో సమావేశ మందిరంలో సోమవారం వైద్యులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్‌సీడీ కింద క్యాన్సర్, మధుమేహం, రక్తపోటు వ్యాధులను గుర్తించి, వారి వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు.ఇందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. ప్రస్తుతం ఉన్న 167 వైద్య బృందాలను 334కి పెంచామన్నారు. ప్రతి బృందం ప్రతి రోజూ 5 నుంచి 7 నివాసాలకు వెళ్లి వ్యాధి వివరాలను నమోదు చేయాలని చెప్పారు. ప్రతి బృందంలోనూ హెల్త్ సూపర్‌వైజర్, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు ఉంటారన్నారు. సర్వేపై నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి, డీపీఎంవో డాక్టర్ రమేష్, ఎన్‌సీడీ పీవో డాక్టర్ యశ్వంత్, డెమె కనకరత్నం, ఎస్‌వో సహన, వైద్యాధికారులు ఎన్‌సీడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు పంచాయతీ విద్యుత్ బకాయిలు రూ.3.6 కోట్లు

● గ్రామంలోని బిట్-1 సచివాలయానికి పవర్ కట్

పొదలకూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖకు పొదలకూరు పంచాయతీ రూ.3.60 కోట్ల విద్యుత్ బకాయిలు ఉంది. దీంతో తక్షణం బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్యాలయం కొనసాగుతున్న పొదలకూరు బిట్-1 సచివాలయానికి విద్యుత్ శాఖ అధికారులు సోమవారం పవర్ కట్ చేశారు. విద్యుత్ శాఖ ఏఈ శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు.. పొదలకూరు పంచాయతీకి సంబంధించి వీధిలైట్లు, వాటర్ మోటార్ల మీటర్లు, తదితర విద్యుత్ బిల్లులు రూ.3.6 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. ఈ పంచాయతీలో వైసీపీకి చెందిన పాలక వర్గం కొనసాగుతోంది. కాగా పంచాయతీ బ్యాంకు ఖాతాలో సుమారు రూ.60 లక్షల ఉన్నట్లు సమాచారం. ఇందులో నుంచి కనీసం రూ.50లక్షలు చెల్లించాలని విద్యుత్ శాఖ అధికారులు కోరారు. అయితే ప్రస్తుతం రూ.5లక్షలు చెల్లిస్తామని, పవర్ కట్ చేయవద్దని పాలకవర్గం కోరింది. దీనికి అంగీకరించని విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ కనెక్షన్ తొలగించారు. దీంతో పంచాయతీ కార్యాలయం కొనసాగుతున్న సచివాలయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలకు అవసరమైన పనులు స్తంభించాయి. సిబ్బంది అత్యవసర పనులను ఇతర సచివాలయాలకు వెళ్లి చేసుకోవాల్సి పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కనీసం కరెంటు బిల్లులు కూడా చెల్లించకపోవడంపై పట్టణ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నాట్య లిఖితం

● కూచిపూడిలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ ● ఎన్నో పురస్కారాలు, ప్రశంసలు
● 'నృత్యకళా నిలయం'లో శిక్షణ ● రాష్ట్ర, జాతీయ స్థాయిలో 400 ప్రదర్శనలు



బాల్యం నుంచే నాట్యంపై మక్కువతో కూచిపూడి నేర్చుకుంది. నేడు అదే కూచిపూడిలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేస్తూ ఆ నృత్య కళను ఆపోశన పడుతోంది. నటరాజు అనుగ్రహంతో నాట్య మయూరిగా ఎందరి నుంచో ప్రశంసలు, పురస్కారాలు అందుకుంది. అంతటితో ఆగిపోకుండా తాను నేర్చుకున్న నర్తనాన్ని భావితరాలకు అందించాలన్న ఆశయంతో నృత్య కళానిలయాన్ని స్థాపించి ఉచితంగా బోధిస్తోంది. ఆమే కావలికి చెందిన గంగపట్నం లిఖిత.



కావలి టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలోని తుఫాన్‌నగర్‌కు చెందిన గంగపట్నం సురేంద్ర, నిర్మల దంపతుల కుమార్తె లిఖిత. చిన్నతనం నుంచే కూచిపూడి నృత్యంపై మక్కువతో పాఠశాలల్లో జరిగే కార్యక్రమాల్లో ప్రదర్శనలిస్తూ ప్రతిభ కనబరిచింది. ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న తండ్రి సురేంద్ర తన కుమార్తె లిఖితకు కూచిపూడిపై ఉన్న ఆసక్తిని గుర్తించి ఆర్థికస్థోమత లేకపోయినా తనవంతుగా ప్రోత్సహించారు. అంచెలంచెలుగా కూచిపూడి నృత్యంలో పట్టు సాధించిన లిఖిత జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రదర్శనలు ఇచ్చి ప్రముఖులతో శభాష్ అనిపించుకుంది. ప్రస్తుతం గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో కూచిపూడి విభాగంలో పోస్టు గ్రాడ్యుయేషన్ రెండో ఏడాది చదువుతోంది. తను నేర్చుకున్న కూచిపూడి కళను భావి తరాలకు అందించాలన్న ఆశయంతో సంయుక్త నృత్య కళానిలయం పేరుతో పాఠశాలను స్థాపించి పది మందికి కూచిపూడిలో శిక్షణ ఇస్తూ నృత్యకళే తన జీవితంగా ముందుకు సాగుతోంది.

● 400కు పైగా ప్రదర్శనలు

లిఖిత ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో సుమారు 400 కుపైగా ప్రదర్శనలు ఇచ్చారు. శిష్యులతో కలసి కూడా ప్రదర్శనలిస్తు న్నారు. శ్రీనివాస కల్యాణం వంటి పౌరాణిక నృత్య రూపకాలతో పాటు సాంఘిక దురాచారాలను రూపుమాపే విధంగా ప్రజల్ని చైతన్యవంతం చేసేందుకు మృత్యు ఘోష వంటి నృత్యరూపకాలు రూపొందించి వేదికలపై ప్రదర్శిస్తున్నారు. శిష్య బృందంతో కలిసి ఇస్తున్న అలాంటి ప్రదర్శనలకు ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధుల మన్ననలు పొందారు

ప్రముఖుల ప్రశంసలు

నెల్లూరు, విజయవాడ, హైదరాబాద్, బెంగుళూరు, తమిళనాడు, కేరళ, ఒరిస్సా తదితర ప్రాంతాల్లో ప్రదర్శనలిచ్చి సుమన్, భానుచందర్, చంద్రబోస్, తనికెళ్లభరణి, శేఖర్ కమ్ముల వంటి సినీ ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు. మంత్రులు నారాయణ, కొల్లు రవీంద్ర, మాజీ మంత్రులు సముద్రాల వేణుగోపాలాచారి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎంపీలు బీద మస్తాన్ రావు, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి , పలు వురు కలెక్టర్లు, ఉన్నతాధికారుల నుంచి సత్కారాలు, పురస్కారాలు పొందారు. కళాతరంగిణి, నాట్యమయూరి, అమేజింగ్ కిడ్ వంటి అవార్డులు, గిన్నిస్ వరల్డ్ రికార్డు, ప్రతిభ అవార్డు, పింగళి వెంకయ్య అవార్డులు అందుకున్నారు.

కూచిపూడి ఉపాధ్యాయురాలే లక్ష్యం...

కూచిపూడి ఉపాధ్యాయురాలిగా ప్రభుత్వ ఉద్యోగం పొందాలన్న సంకల్పంతో ఆ నాట్య కళలో పీజీ చదువుతున్నాను. కళను భావితరాలకు అందించేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయినిగా మంచి అవకాశముంటుంది. లక్ష్యం సాధిస్తానన్న నమ్మకంతో ముందుకు సాగుతున్నాను.

- లిఖిత



హైదరాబాద్‌లో శ్రీనివాస కల్యాణం నృత్యరూపకం ప్రదర్శిస్తున్న లిఖిత శిష్యబృందం

స్టాక్ యార్డ్‌లో నిల్వ చేసిన రూ. కోటి విలువైన తెల్లరాయి మాయం



గతంలో తెల్లరాయి స్టాక్‌ను సీజ్ చేసిన అధికారులు (ఫైల్)



ప్రస్తుతం స్టాక్ యార్డ్‌లో సగమే ఉన్న తెల్లరాయి

చేజర్ల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): స్టాక్ యార్డ్‌లో నిల్వచేసిన కోటి రూపాయల విలువ చేసే తెల్లరాయి రాత్రికి రాత్రే మాయమైన సంఘటన ఆదివారం వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొలవ నాయుడుపల్లి గ్రామ సమీపంలో గత ప్రభుత్వంలో స్థానిక వైసీపీ నాయకుడి కనుసన్నలలో శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ మినరల్స్ ఎమ్‌డిఎల్ స్టాక్ పాయింట్ పేరుతో అక్రమంగా సేకరించిన తెల్లరాయిని స్టాక్‌యార్డ్‌లో నిల్వఉంచారు. అయితే ప్రభుత్వం మారడంతో గ్రామస్థుల ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో తనిఖీ చేసిన మైనింగ్ అధికారులు అక్రమమని తేల్చి దాదాపు 1200 టన్నుల ఉన్న తెల్లరాయి స్టాక్‌యార్డ్‌ని సీజ్ చేసి అక్కడ మైనింగ్‌కు సంబంధించిన వారినే కాపలాగా పెట్టారు. అయితే అదివారం ఉదయం అటుగా పొలాలకు వెళ్లిన రైతులు స్టాక్ యార్డ్‌లో సగంకు పైగా తెల్లరాయిని అక్రమంగా రాత్రికి రాత్రే ఎత్తుకెళ్ళినట్లు గుర్తించారు. ఈసంఘటనపై మైనింగ్ అధికారులకు సమాచారం ఇచ్చినా తమకు ఏమీ తెలియనట్లు వ్యవహరించారని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఈ సంఘటనపై మైనింగ్ అధికారులను ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జోరుగా గంజాయి విక్రయాలు

● మత్తులో జోగుతున్న యువత

లింగసముద్రం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో జోరుగా గంజాయి విక్రయాలు జరుగుతున్నాయి. మండలకేంద్రంలోని తాతా హోటల్ సమీపంలో ఓ కాలనీ, పెదపవని తో పాటు మరికొన్ని గ్రామాల్లో ఈ విక్రయాలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఎక్కువగా కావలి, నెల్లూరు ప్రాంతాల నుంచి కొందరు వ్యక్తులు తెచ్చి చిన్న పొట్లాలను తయాఅరు చేసి విక్రయిస్తున్నట్టు సమాచారం. ఇటీవల ఇరువురు యువకులు లింగసముద్రం పంచాయతీ కార్యాలయంలో రాత్రి 7గంటల సమయంలో గంజాయి సేవిస్తుండగా సర్పంచు వారిని మందలించి పంపించారు. అలాగే 15రోజుల క్రితం ఓ యువకుడు గంజాయి సేవించి జంపాలవారిపాలెం ఎస్సీ కాలనీ వద్ద రోడ్డు పక్కన ఉన్న బెంచీపై పడిపోయాడు. అలాగే మూడునెలల క్రితం పెదపవని హైస్కూల్ వద్ద కూడా రాత్రి వేళ గంజాయి సేవిస్తుండగా, కొందరు వారిని ప్రశ్నించగా వారిపై తిరగబడ్డారు. గంజాయి వాడకంతో యువత కూడా పెడతోవ పడుతున్నట్టు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 4,758 మంది హాజరు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులకు జరుగుతున్న ప్రయోగ పరీక్షలకు సోమవారం జిల్లా వ్యాప్తంగా 4,758 మంది హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్‌కు 2,685 మంది హాజరు కావాల్సి ఉండగా 2,612 మంది హాజరయ్యారు. 73 మంది గైర్హాజరయ్యారు. మధ్నాహ్నం జరిగిన ప్రాక్టికల్స్‌కు 2,216 మంది హాజరు కావాల్సి ఉండగా, 2,146 మంది హాజరయ్యారు. 70 మంది గైర్హాజరయ్యారు. ఆర్‌ఐవో డాక్టర్ ఏ.శ్రీనివాసులు నాలుగు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి ప్రాక్టికల్స్ జరుగుతున్న తీరును పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఆర్‌ఐవోతో పాటు డీవీఈవో 2 కేంద్రాలను, డీఈసీ సభ్యులు ఐదు కేంద్రాలను, ఫ్లైయింగ్‌స్క్వాడ్ 12 సెంటర్లను పరిశీలించారు.

డిగ్రీ పరీక్షలకు 8 మంది గైర్హాజరు

వెంకటాచలం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో సోమవారం జరిగిన డిగ్రీ 1వ, 4వ సెమిస్టర్ మెగా సప్లిమెంటరీ పరీక్షలకు 8 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలలో 172 మంది విద్యార్థులకు 164 మంది హాజరయ్యారని ఆయన పేర్కొన్నారు.

రేపు మహిళల హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళా జిల్లా జట్ల ఎంపికను నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ కార్యదర్శి డి.శ్రీరేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు వచ్చేవారు ఆధార్, జననధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు. ఎంపికైన క్రీడాకారిణిలు కర్నూలులో ఈనెల 21 నుంచి 23 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

శత వసంతాల సుబ్బయ్య బడి

● బ్రిటీష్ హయాంలో ప్రారంభమై హిందూ ఎయిడెడ్ పాఠశాలగా గుర్తింపు
● నేడు అల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలగా రూపాంతరం ● రేపు ఉత్సవాలకు కమిటీ ఏర్పాట్లు

అల్లూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పేటలో జడ్పీ ఉన్నత పాఠశాల (సుబ్బయ్య బడి) బుధవారంతో శత వసంతాలను పూర్తి చేసుకోనుంది. బ్రిటీష్ హయాంలోనే స్థానికుడైన వేమూరు శేషయ్య అక్షరాస్యతను పెంచేందుకు 1925లో తన స్వగృహంలోనే కుమారుడు సుబ్బయ్య పేరుతో పాఠశాలను ప్రారంభించాడు.

● హిందూ ఎయిడెడ్ పాఠశాలగా గుర్తింపు..

అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం ఈ పాఠశాలకు హిందూ ఎయిడెడ్ పాఠశాలగా గుర్తింపునిచ్చింది. ఆ విధంగా ఏర్పాటు చేసిన బడిలో విద్యార్థులను చేర్చుకుంటూ వారిలో అక్షరాస్యతను పెంచుతూ ముందుకు సాగింది. ఆయన తదనంతరం శేషయ్య మనవళ్లు వెంకట సుబ్రహ్మణ్యం, శేషగిరిరావు కరస్పాండెంట్, ప్రధానోపాధ్యాయుడిగానూ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తూ వచ్చారు.

● 1979లో ప్రభుత్వంలో విలీనం..

స్వాతంత్ర్యం వచ్చాక విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు అప్పటి మన ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో భాగంగా ఈ పాఠశాలను 1979లో ప్రభుత్వంలో విలీనం చేశారు. అప్పటినుండి పంచాయతీ సమితి పాఠశాల కొనసాగింది.



● నేడు శాశ్వత గుర్తింపు..

1983లో ప్రాథమికోన్నత పాఠశాలగా, 2020లో జడ్పీ ఉన్నత పాఠశాలగా దినదినాభివృద్ధి చెందుతూ నేడు శాశ్వత గుర్తింపును పొందింది. అప్పటి మహానుభావుల పుణ్యఫలమే ఆనాటి విద్యార్థులకు విద్యనందించే విధంగా ఏర్పాటు చేసిన ఈ పాఠశాల ఈ ఏడాదితో శత వసంతాలను పూర్తి చేసుకుంది. ఇంతటి ఘన చరిత్రలు కలిగిన పాఠశాలలు అరుదుగా ఉన్నాయి. అలాంటి పాఠశాల అల్లూరుకు చెందినది కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల శత వసంతోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు పాఠశాల కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

కందుకూరు మున్సిపాలిటీకి ఎన్నికలు?

● మే, జూన్‌లో నిర్వహణకు సన్నాహాలు ● సీఎం పర్యటన ఉద్దేశం కూడా అదేనా!?

కందుకూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కందుకూరు మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలన్న కృత నిశ్చయంతో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు కందుకూరును ఎంపిక చేసుకోవటం, మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల కోసం రూ.50 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడం కూడా ఎన్నికల సన్నాహాల్లో భాగమేనని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గత 13 సంవత్సరాలుగా పాలకవర్గం లేకుండా అధికారుల పాలనలో నడుస్తున్న కందుకూరు మున్సిపాలిటీకి ఎట్టిపరిస్థితుల్లో ఎన్నికలు జరిపి పాలకవర్గం ఏర్పాటయ్యేలా చూడాలన్న ఆలోచనతో ప్రభుత్వం ప్రయత్నిస్తుండటం వల్లే చంద్రబాబు కందుకూరు అభివృద్ధిపై దృష్టి సారించారని అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి మున్సిపల్ శాఖామంత్రిగా జిల్లాకు చెందిన పొంగూరు నారాయణ బాధ్యతలు చేపట్టిన వెంటనే ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావును పిలిపించుకుని కందుకూరు మున్సిపాలిటీకి 2, 3 నెలల్లో ఎన్నికలు జరపాల్సి ఉంటుందని అందుకోసం సిద్ధం కావాలని సూచన చేసిన విషయం తెలిసిందే. అప్పట్లో కొద్దిరోజులు మున్సిపల్ ఎన్నికలపై ఔత్సాహికులు హడావిడి చేసినా తర్వాతి కాలంలో ఆ విషయం మరుగునపడింది. ప్రస్తుతం మంత్రి నారాయణ అదే ప్రయత్నాల్లో ఉండటం, మే, జూన్ నెలల్లో జరగబోయే ఎన్నికల్లో కందుకూరు మున్సిపాలిటీలో జయకేతనం ఎగరవేసి మీకు గిఫ్ట్‌గా ఇస్తామని చంద్రబాబుకు ఎమ్మెల్యే ఇంటూరి విజ్ఞప్తి చేశారు. అంటే ఎన్నికలకు సన్నద్ధమవుతున్నట్లు ఎమ్మెల్యే బహిరంగంగానే చెప్పగా అందుకు అనుగుణంగానే సీఎం కూడా నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించటం విశేషం.



● కోర్టు కేసులు అడ్డంకి తొలగేనా?

కందుకూరు మున్సిపాలిటీకి చివరిసారిగా 2007లో ఎన్నికలు జరిగాయి. అప్పట్లో ఎన్నికైన పాలకవర్గం 2012 వరకు కొనసాగగా ఆ తర్వాతి నుంచి అధికారుల పాలనే నడుస్తోంది. ఆ ఎన్నికలకు ముందు అప్పటి వరకు మున్సిపాలిటీలో అంతర్భాగంగా ఉన్న గనిగుంట, దివివారిపాలెం, కంద్రావారిపాలెం, చుట్టుగుంట, గళ్లావారిపాలెం, ఆలావారిపాలెం, ఆనందపురం, శామీరపాలెం తదితర గ్రామాలను కందుకూరుకు సుదూరంగా ఉన్నాయన్న కారణంతో మున్సిపాలిటీ నుంచి తొలగించి ఎన్నికలు నిర్వహించారు. అయితే ఈ తొలగింపు ప్రక్రియ చట్టవిరుద్ధంగా జరిగిందని తిరిగి తమ గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టులో కేసు నడుస్తున్న కారణంగా ఎన్నికలు జరగలేదు. అనంతరం 2018లో ఆ గ్రామాల తొలగింపు ప్రక్రియ చట్టబద్ధంగా జరగనందున తిరిగి విలీనం చేయాలని తీర్పు ఇవ్వటంతో తిరిగి మున్సిపాలిటీలో విలీనం చేశారు. అయితే ఆ విలీనాన్ని సవాల్ చేస్తూ పలువురు కోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారం ఇప్పటికీ కోర్టులోనే నడుస్తోంది. ప్రస్తుతం ఎన్నికలు జరపాలన్న పట్టుదలతో ప్రభుత్వం ఉన్నందున కోర్టులో వాజ్యం వేసి ఉన్నవారి చేత ఉపసంహరింజేసే దిశగా ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం. ఆ ప్రయత్నం విఫలమైనా కోర్టు ఉత్తర్వుల మేరకే గ్రామాలను విలీనం చేశారు కనుక ఎన్నికల నిర్వహణకు ఎలాంటి అడ్డంకి ఉండబోదని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

గతంలో చేసి ఉన్న రిజర్వేషన్ ప్రకారమైతే కందుకూరు మున్సిపాలిటీ జనరల్ మహిళకు రిజర్వ్ అయి ఉంది. దీని ప్రకారమే ఎన్నికలు నిర్వహించవచ్చని సమాచారం.



కావలి-ఉదయగిరి రోడ్డులో ఉదయం కురుస్తున్న మంచులో లైట్లువేసుకుని వస్తున్న వాహనదారులు



పగలు ఎండ... రాత్రి మంచు

పగలు ఎండ తీవ్రంగా ఉంటుందో..రాత్రికి అంతే తీవ్రతగా మంచు కురుస్తున్నది. వాతావరణంలో వస్తున్న మార్పులతో ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. సోమవారం ఉదయం 8గంటల వరకు ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించ లేదు. జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలు ఈ మంచుతో ప్రమాదాలు జరుగకుండా వాహనాలకు లైట్లు వేసుకున్నారు.

- కావలి (ఆంధ్రజ్యోతి)

ఈ భోజనం తినేది ఎలా...?

ఆత్మకూరులోని ఏసీఎస్ఆర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం బాగోలేదంటూ సోమవారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. భోజన పథకం నిర్వాహకులను నిలదీశారు. వీరి ఆందోళనతో అక్కడికి చేరుకున్న విద్యా కమిటీ చైర్మన్, సభ్యులు కూడా వీరికి మద్దతుగా నిలిచి నిర్వాహకులను మందలించారు. కూరల్లో కారం ఎక్కువగా ఉందని, కోడిగుడ్లు కుళ్లిపోయాయని, వాటిని తింటే కడుపు నొప్పితో వాంతులు అవుతున్నాయని విద్యార్థులు వాపోయారు.

- ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి)



కనీస వేతనం రూ.26 వేలివ్వాలి

నెల్లూరు (హరనాథపురం) ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్లు, నగరంలోని ఐసీడీఎస్ పీడీ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కే. అజయ్‌కుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న మొత్తం మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ వెంటనే జీవో ఇవ్వాలని, హెల్పర్ల ప్రమోషన్లకు నిర్థిష్టమైన గైడెన్స్ రూపొందించి అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రూరల్ అధ్యక్షుడు కొండా ప్రసాద్, నగర అధ్యక్షుడు అత్తిమూరి శ్రీనివాసులు, ఎస్‌కె.షాహీనాబేగం, అంగన్‌వాడీ నాయకురాళ్లు నాగభూషణమ్మ, సంపూర్ణమ్మ, కామాక్షమ్మ, మల్లెమ్మ, రజిని, తదితరులు పాల్గొన్నారు.



ప్రతి అర్జీని పరిశీలించి పరిష్కరించాలి

- జాయింట్ కలెక్టర్ జేసీ కార్తీక్
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 472 వినతులు

నెల్లూరు (హరనాథపురం) ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి అర్జీని నిశితంగా పరిశీలించి, పరిష్కరించాలని జేసీ కే.కార్తీక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో వేదిక కార్యక్రమం జరిగింది. జేసీతోపాటు డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, జడ్పీ సీఈవో విద్యారమ, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, డీపీవో శ్రీధర్ రెడ్డి తదితరులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ ప్రజలు అందించిన అర్జీలను నిర్ధిష్ట గడువు లోగా పరిశీలించి పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ పరమైన అంశాలపై అర్జీలు ఎక్కువగా ఉంటున్నాయని, వాటిని పరిష్కరించే దిశగా అధికారులు వ్యక్తిగత శ్రద్ధ పెట్టాలన్నారు.

● మొత్తం 472 అర్జీలు

వేదిక కార్యక్రమానికి మొత్తం 472 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూ శాఖవి 172, మున్సిపల్ శాఖవి 60, సర్వేశాఖవి 72, పంచాయతీరాజ్ శాఖవి 29, కాగా మిగిలినవి ఇతర విభాగాలకు సంబంధించినవి.



బీజేపీ నాయకుడి విన్నపాన్ని వింటున్న జేసీ కార్తీక్

● గ్యాస్ పైప్‌లైన్ నిర్మాణంతో వెతలు

బీపీసీఎల్ కంపెనీ వారు గ్యాస్ పైప్‌లైన్ నిర్మాణం కోసం 18 మీటర్ల వెడల్పున గుంతలు తీసి పొలాలను నాశనం చేస్తున్నారని టీపీగూడూరు మండలం పేడూరు గ్రామ రైతులు పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని జేసీని కోరారు.

● కాంట్రాక్టర్లకు వరం ఉపాధి హామీ పథకం

ఉపాధి హామీ పథకం పనుల్లో యంత్రాలు వినియోగించరాదని చట్టాలు చెబుతున్నా, ఆచరణలో అమలు కావడంలేదని, కూలీలకు ఉపాధి కల్పించాల్సిన ఈ పథకం కాంట్రాక్టర్లకు వరంగా మారిందని, అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని వైసీపీ పంచాయతీరాజ్ విభాగం నేతలు జేసీని కోరారు.

● రైతులకు సహకారం అందించాలి

ధాన్యానికి మార్కెట్ ధర తగ్గినప్పుడు రైతులకు మార్జిన్ బోనస్ ఇప్పించాలని, 160 దేశాల్లో బియ్యం కొరత ఉన్నందున ఆయా దేశాలకు రైతులే నేరుగా ఎగుమతి చేసేందుకు వారికి అవకాశం కల్పించాలని కోరుతూ టీడీపీ రైతు విభాగం నేతలు జేసీకి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రైతు నేతలు ఆర్.రాధాకృష్ణమనాయుడు, ఎం.ప్రభాకర్‌రెడ్డి, బీ.రామారావు, శరత్‌బాబు, తదితరులు పాల్గొన్నారు

● మైనింగ్ అధికారులతో ఇబ్బందులు

తాము సాగుచేసుకుంటున్న భూమిని మైనింగ్ అధికారు లు అడ్డుకోకుండా చూడాలని వెంకటాచలం మండలం కందలపాడు గ్రామస్థులు జేసీకి వినతిపత్రం సమర్పించారు.

● ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

గ్రామాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని జనసేన పార్టీ సీనియర్ నేత నూనె మల్లికార్జున్‌యాదవ్ జేసీకి వినతిపత్రం సమర్పించారు. చాలా గిరిజన ప్రాంతాల్లో రోడ్లు లేవని, వెంటనే రోడ్లు వేయాలని కోరారు.



ఫిర్యాదుదారుతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

చట్టప్రకారం న్యాయం చేస్తాం

● ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై విచారణ జరిపి, చట్టప్రకారం న్యాయం చేస్తామని ఎస్పీ జీ. కృష్ణకాంత్ తెలిపారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా వ్యాప్తంగా 93 మంది అర్జీలు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

● నెల్లూరు బాలాజీనగర్, బుచ్చి, కోవూరు, గుడ్లూరు ప్రాంతాలకు చెందిన యువకులకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని పొదలకూరుకి చెందిన భగవాన్ నమ్మించి మోసం చేసాడని బాధితులు ఎస్పీకి మొరపెట్టుకున్నారు. ఒక్కొక్కరి వద్ద రూ.1.60 లక్షలు తీసుకుని, వారికే తెలియకుండా వర్ధన్ ఫైనాన్స్ నుంచి రూ.3లక్షలు లోన్ తీసుకున్నాడని వారు తెలిపారు. నకిలీ అపాయింటెమెంట్ ఆర్డర్స్ ఇచ్చాడని, అయితే అసలు ఆ కంపెనీయే లేదని, నగదు ఇవ్వమని అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. స్పందించిన ఎస్పీ వెంటనే విచారించి యువతకు న్యాయం చేయాలని ఆదేశించారు.

● డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను విమర్శించిన సీపీఐ నేత రామకృష్ణపై చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు పోలీసు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. నాయకుడు నూనె మల్లికార్జున మాట్లాడుతూ సనాతనధర్మం కోసం పవన్‌కల్యాణ్ చేస్తున్న కృషిని అభినందించాలి కాని విమర్శలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గునుకుల కిషోర్, పవన్‌యాదవ్, ప్రశాంత్, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

నేర వార్తలు

వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి

తోటపల్లిగూడూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సముద్రంలో వేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని వెంకన్నపాళెం పంచాయతీ పట్టపుపాళెంకు చెందిన కొండూరు వెంకటేశ్వర్లు(55) ఆదివారం రాత్రి సముద్రంలో చేపల వేటకు వెళ్లాడు. ఏమి జరిగిందో తెలియదు కానీ సోమవారం శరత్ వంతెన దగ్గర వెంకటేశ్వర్లు మృతదేహం లభ్యమైంది. దీంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ వీరేంద్ర బాబు ఘటనాస్థలిని పరిశీలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వాహనాల చోరీపై కేసుల నమోదు

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని చిన్నబజారు పోలీసు స్టేషన్ పరిధిలో వరుసగా జరిగిన వాహనాల చోరీలపై పోలీసులు సోమవారం కేసులు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు..

● జిల్లా కోర్టు ప్రాంగణంలో నిలిపిన ఆటోను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారని చౌటపాళెం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు చిన్నబజారు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. చుట్టుక్కల గాలించినా ఆటో కన్పించక పోవడంతో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● నగరంలోని బట్వాడిపాలెం సెంటర్‌కు చెందిన వెంకటేష్ ఏసీ కూరగాయాల మార్కెట్‌లో పనిచేస్తున్నాడు. ఆయన గత నెల 25న మార్కెట్‌లో పనికి వచ్చి తన మోపెడ్‌ను మార్కెట్‌లోని పబ్లిక్ టాయిలెట్స్ వద్ద పార్క్ చేశాడు. గుర్తుతెలియని దుండగులు దాన్ని దొంగలించడంతో చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు.

● పొగతోటకు చెందిన జీ చంద్రశేఖర్ ఎస్2 రోడ్డులో ఐరన్ దుకాణం నిర్వహిస్తున్నారు. గతనెల 14న ఆయన తన దుకాణం సమీపంలో మోపెడ్‌ను పార్క్‌చేశాడు. పని పూర్తయ్యాక చూడగా కన్పించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కుమారుడి మిస్సింగ్‌పై తండ్రి ఫిర్యాదు

● సీఎంవో కార్యాలయ ఆదేశాల మేరకు కేసు నమోదు

కావలి రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి కార్యాలయ (సీఎంవో) ఆదేశాల మేరకు కావలి 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం మిస్సింగ్ కేసు నమోదైంది. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని గాయత్రీనగర్‌కు చెందిన మెట్టు శివయ్య కుమారుడు మల్లికార్జున్‌రావు బెంగళూరులోని బయోకంపెనీలో ఉద్యోగం చేసేవాడు. అక్కడ ఒక యువతిని ప్రేమ వివాహం చేసుకున్నానని అక్కడే ఉంటానని కుటుంబ సభ్యులతో ఏడేళ్ల కిందట చెప్పి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి మల్లికార్జున్‌రావు తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఈ విషయమై ఈ నెల 15న కందుకూరుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును మల్లికార్జున్ తండ్రి శివయ్య కలిసి తమ గోడు వెల్లబోసుకున్నాడు. మల్లికార్జున్‌రావు మిస్సింగ్ విషయమై ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు లేదని సీఎంవో కార్యాలయ ఆదేశాలు, శివయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

లక్ష ఎకరాలకుపైగా 'ఈ-క్రాప్' నిల్ : బీజేపీ

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చెరువులు, వాగులు, పోరంబోకు భూముల్లో అనధికారికంగా రైతులు సుమారు లక్షకుపైగా ఎకరాల్లో వరి సాగు చేసుకుంటున్నారని, వీరందరికీ అధికారులు ఈ-క్రాప్ నమోదు చేయలేదని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ ఆరోపించారు. ఈ విషయమై సోమవారం ఆయన నెల్లూరు వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏడీఏ నర్సోజీకి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదు చేయకపోవడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకునే అవకాశం లేదని చెప్పారు. పంట కోత అనంతరం ధాన్యం ఆరబెట్టుకునే సౌకర్యాలు లేకపోవడంతో రైతుకు గిట్టుబాటు ధర కంటే తక్కువకే అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొన్నదని అన్నారు. తేమశాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరాల సుబ్బారెడ్డి, అలీ, రవికుమార్ యాదవ్, కంచర్ల నారాయణ యాదవ్, కాలంగి సుబ్బారావు, నారాయణరావు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఏడీఏ నర్సోజీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ

నెల్లూరు (హరనాథపురం) ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రెవెన్యూ సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని జేసీ కే. కార్తీక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సబ్‌కలెక్టర్లు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. పీజీఆర్ఎస్, ఎఫ్‌లైన్ సర్వే, ఏపీ సేవ పోర్టల్ దరఖాస్తులు పెండింగ్ లేకుండా నిర్థిష్ట గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమైన మండలాల్లో ఈకేవైసీ, ఈ-క్రాప్ నమోదు చేయించాలని ఆదేశించారు. జిల్లాలో బర్డ్‌ఫ్లూ లేదని, పశుసంవర్ధక శాఖ అధికారులు, డాక్టర్లు అన్ని కోళ్ల ఫ్లారాలను పరిశీలించి తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారని చెప్పారు. ఇతర జిల్లా నుంచి వచ్చే కోళ్లను కూడా చెక్‌పోస్టులు పెట్టి తనిఖీ చేసి ఆరోగ్యకరంగా ఉన్నట్లయితేనే అనుమతిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ జేడీ రమేష్ తెలిపారు. బర్డ్‌ఫ్లూ వదంతులను ఎవరూ నమ్మవద్దని, తమ శాఖ ఆధ్వర్యంలో అన్ని ముందస్తు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఆర్వో ఉదయభాస్కర్, జడ్పీ సీఈవో విద్యారమ, డీపీవో శ్రీధర్‌రెడ్డి, హౌసింగ్, డ్వామా పీడీలు వేణుగోపాల్, గంగాభవాని, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు విజయన్, వెంకటరమణ, డీఈవో బాలాజీరావు పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం : రూ.5లక్షల ఆస్తి నష్టం

కొండాపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గుడవళ్లూరు పంచాయతీ పెద్దూరు గ్రామానికి చెందిన కోనేటి కోటేశ్వరమ్మ పొగాకు బ్యారన్‌ను పార్లపల్లి గ్రామానికి చెందిన గోరంట్ల శ్రీను లీజుకు తీసుకొని పొగాకు కాల్చుకుంటున్నాడు. పొగాకు కాల్చుకొని ఆరబెట్టుకునే క్రమంలో సోమవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధం అయ్యింది. పొగాకుతో ఉన్న కర్రజారి గొట్టాల పైపడి మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు ఆర్పివేసేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. విషయాన్ని వింజమూరు అగ్నిమాపక సిబ్బందికి తెలియజేశారు. వారు సంఘటనాస్థలానికి చేరుకుని మంటలను ఆర్పేసరికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ప్రమాదంలో రూ.5లక్షల ఆస్తి నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

వైద్య విద్యతో సమానంగా ఉపకార వేతనాలు ఇవ్వాలి

● వీపీసీ డీడీ సోమయ్య

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యాకోర్సులు చదువుతున్న విద్యార్థులతో సమానంగా పశువైద్యవిద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉపకారవేతనాలు ఇవ్వాలని వెటర్నరీ పాలి క్లినిక్(వీపీసీ) డీడీ డాక్టర్ టీ. సోమయ్య పేర్కొన్నారు. ఎస్వీ వెటర్నరీ విశ్వవిద్యాలయంలో ఉపకార వేతనాల కోసం పశువైద్య విద్యార్థులు చేస్తున్న సమ్మెకు మద్దతుగా సోమవారం నెల్లూరు రైల్వే ఫీడర్సురోడ్డులోని పశువైద్యశాల జూనియర్ వెటర్నరీ వైద్యులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు పాడిరంగం చాలా ముఖ్యమైందని, ఏడాదికి దాదాపు రూ.60వేల కోట్లు అందిస్తోందని చెప్పారు. కాని వైద్య విద్య విద్యార్థులతో పోలిస్తే పశు వైద్య విద్యార్థులకు చాలా తక్కువ స్కాలర్‌షిప్ అందుతోందన్నారు. దానిని పెంచాలని కోరారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీ మాలకొండయ్య, పశువైద్యులు కృష్ణమూర్తి, రామచంద్రరావు, పశువైద్య సహాయ శస్త్ర చికిత్స నిపుణుడు జయప్రకాష్, వెటర్నరీ పాలీ క్లీనిక్ సిబ్బంది పాల్గొన్నారు.



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న పశుసంవర్ధకశాఖ అధికారులు, జూనియర్ వైద్యులు

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గిట్టుబాటు ధర

● జిల్లా సహకార సంఘం అధికారి గుర్రప్ప

సంగం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో గిట్టుబాటు ధర లభిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార సంఘం అధికారి గుర్రప్ప కోరారు. సోమవారం ఆయన స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈఏడాది సుమారు 3.5 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారని 11.5 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలనే ఉద్దేశంతో జిల్లావ్యాప్తంగా 298 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామన్నారు. సాధారణ రకం ధాన్యం క్వింటా రూ. 2300, ఏ గ్రేడ్ రకం ధాన్యం క్వింటా రూ. 2320 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందన్నారు. పుట్టి (850 కేజీలు) సాధారణ రకం రూ. 19,550, ఏగ్రేడ్ రకమైతే 19,720 చొప్పున ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేస్తారని తెలిపారు. గోనె సంచులు, హమాలీ, రవాణా రైతులే భరిస్తే ధాన్యం డబ్బులతోపాటు నేరుగా రైతు ఖాతాకే నగదు జమ చేయబడుతుందని తెలిపారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో టెక్నికల్ అసిస్టెంట్‌తోపాటు డేటా ఆపరేటర్, తేమశాతం గుర్తించే యంత్రం సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, సంగం సాగునీటి సంఘం అధ్యక్షుడు షేక్ బాబు, టీడీపీ నాయకులు బాణా శ్రీనివాసులురెడ్డి, పిట్టు పట్టాభిరెడ్డి, పీఏసీఎస్ కార్యదర్శి దస్తగిరి, రైతులు పాల్గొన్నారు.



సంగంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గుర్రప్ప, పక్కన ప్రజా ప్రతినిధులు, అధికారులు

కల్తీ మద్యం ముఠా గుట్టు రట్టు

● ఐదుగురు నిందితుల అరెస్టు ● క్యాపింగ్ యంత్రం, ఆటో, సెల్‌ఫోన్ల స్వాధీనం

నెల్లూరురూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం ముఠా గుట్టును ఎక్సైజ్ పోలీసులు సోమవారం రట్టు చేశారు. ఇటీవల మండలంలోని పల్లెపాళెం వద్ద నిందితులను పట్టుకున్న రూరల్ ఎక్సైజ్ పోలీసులు, తాజాగా కనుపర్తిపాడు వద్ద క్యాపింగ్ యంత్రాన్ని స్వాధీనం చేసుకుని, మరో ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ ప్రసన్నలక్ష్మి తెలిపారు. ఆమె కథనం మేరకు.. ఈనెల 13న వెంకటాచలం మండలం జంగాలపల్లి వద్ద బెల్టు షాపులపై దాడులు చేసి 180 ఎంఎల్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సీసాల మూతలపై అనుమానం ఉండటంతో బెల్టు షాపు నిర్వాహకుడు వెంకయ్యను విచారించారు. తనకు చల్లా రమేష్, చందుకుమార్ వీటిని ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. వారిని అదుపులోకి తీసుకోగా అజీజ్ నుంచి దిగుమతి చేస్తున్నట్లు తెలియచేశాడు. దీంతో కనుపర్తిపాడులోని అతడి ఇంటిపై దాడి చేసి, అక్కడ మరో నలుగురిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టారు. వీరిలో కొందరు సర్వేపల్లిలోని ఎస్ఎన్‌జీ డిస్టిలరీలో పనిచేసే ఉద్యోగులు కావడంతో అక్కడ్నుంచి మద్యం, సీసాలు, లేబుళ్లు దొంగలించి అజీజ్ ఇంటి వద్ద ఖరీదైన లేబుళ్లు వేసి అనుమతులు లేని కల్తీ మద్యం సీసాల్లో నింపి ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు తేలిందని ఆమె తెలిపారు. ఈ కేసుల్లో ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, తాజాగా అజీజ్ తోపాటు మరో నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఆమె తెలిపారు. ఈ దాడుల్లో 20 లీటర్ల క్యాన్లు 10, క్యాపింగ్ యంత్రం, మద్యం సీసాలు, ఆటో, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు శకుంతలదేవి, మునీర్ అహ్మద్ పాల్గొన్నారన్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యం, నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

రంగడి బ్రహ్మోత్సవాలకు నాంది

● ఆలయంలో శాస్త్రోక్తంగా గుంజ ప్రతిష్ఠ

నెల్లూరు నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో మార్చి 9 నుంచి 20 వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు నాందిగా సోమవారం గుంజ ప్రతిష్ఠ జరిగింది. వేదపండితులు, అర్చకులు, వేదమంత్రాలతో గుంజను పసుపు, కుంకుమ, పూలతో అలంకరించారు. అనంతరం సకలదేవతలను ఆరాధిస్తూ బ్రహ్మోత్సవాలు విజయవంతంగా జరగాలని ఆశిస్తూ గుంజను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈవో ఆళ్ల శ్రీనివాస రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)



చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	100
లేయర్ లైవ్	80
స్కిన్ చికెన్	184
స్కిన్‌లెస్	206
లేయర్	136

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8178
వెండి కిలో ధర	రూ. 98,800
వెండి ఒక గ్రాము	రూ. 101.80

ధాన్యం విక్రయించాలంటే
ఈ-క్రాప్ తప్పనిసరి


కలువాయి : ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

కలువాయి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించాలంటే తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకుని ఉండాలని మండల వ్యవసాయాధికారి వీ ప్రతాప్ తెలిపారు. స్థానిక సొసైటీ కార్యా లయంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభి ంచారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ తెలుగురాయపురం, వెరుబొట్లపల్లిలో ఏ-గ్రేడు, కలువాయి, కుల్లూరు, మాదన్నగారిపల్లె, బద్దెవోలులో బీ-గ్రేడు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు ఆయన వివరించారు. ఏ-గ్రేడు పుట్టి రూ.19,720, బీ-గ్రేడు పుట్టి రూ.19,550కు రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. రవాణా, హమాలీ, ప్యాకింగ్ ఖర్చులన్నీ కూడా అదనంగా రైతుల ఖాతాల్లోకి నేరుగా జమ చేయబడుతుందని తెలిపారు. ప్రతి రైతూ తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో సుదర్శన్, టీడీపీ నాయకులు చల్లా రఘురామిరెడ్డి, గడ్డం కిషోర్‌రెడ్డి, తెలుగురాయపుం నీటి సంఘం అధ్యక్షుడు మల్లు విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెట్రోలు బంకు నిర్మాణం చేపట్టరాదు

● రాష్ట్ర టీడీపీ కార్యాలయంలో అభివృద్ధి మండలి ప్రతినిధుల ఫిర్యాదు


మంగళగిరి టీడీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న కందుకూరు నియోజకవర్గ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు

కందుకూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల కార్యాలయాల ఆవరణలో ఏటీసీ పెట్రోలుబంకు ఏర్పాటుకు గత ప్రభుత్వంలో ఇచ్చిన అనుమతులను తక్షణం రద్దు చేసేలా చూడాలని నియోజకవర్గ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు సోమవారం మంగళగిరిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. నామమాత్రపు లీజుతో ఎంతో విలువైన వాణిజ్య విలువున్న ప్రాంతంలో కోట్ల విలువైన స్థలాన్ని ఏటీసీ పెట్రోలు బంకుకు ఇవ్వటం దుర్మార్గపు చర్య అన్నారు. ఈ ప్రాంతంలో పెట్రోలుబంకు ఏర్పాటు చేస్తే ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతుంద న్నారు. కార్యక్రమంలో తేకల వెంకటేశ్వర్లు, పొడపాటి శ్రీను, కె. మణి, పాలేటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన అవసరం


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

ఉదయగిరి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గండిపాళెం పీహెచ్‌సీ ఆరోగ్య బోధకుడు కె వెంకటసుబ్బయ్య సూచించారు. సోమవారం జాతీయ క్షయవ్యాధి నివారణలో భాగంగా పట్టణంలోని ఎంఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హోలీ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించి కరపత్రాలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మందులతో క్షయవ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఎల్ నారాయణస్వామి, వీ సుధాకర్, వైద్యఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనర్హులకు ఇళ్ల పట్టాల పంపిణీపై ఫిర్యాదు


డిప్యూటీ తహసీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న షేక్ బాబు

సంగం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అనర్హులకు ఇళ్ల పట్టాల పంపిణీపై సంగం సాగునీటి సంఘం అధ్యక్షుడు షేక్ బాబు సోమవారం డిప్యూటీ తహసీల్దారు సంధ్యకు ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వంలో తలుపూరుపాడు గ్రామానికి చెందిన అనర్హులైన ఇద్దరు వైసీపీకి చెందిన వారికి సంగంలోని 252 సర్వే నెంబరులో ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఆమేరకు విచారించి ఆ పట్టాలను రద్దు చేసి అర్హులైన పేదలకు ఇవ్వాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రేపు దరఖాస్తుల పరిశీలన

దుత్తలూరు(ఉదయగిరి), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో బీసీ రుణాల మంజూరుకు సంబంధించి దరఖాస్తుల పరిశీలన బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో మీసాల వెంకటేశ్వర్లు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు దరఖాస్తుతోపాటు జత పరిచిన అన్ని ధ్రువపత్రాలతో హాజరు కావాలని ఆయన కోరారు.

మోటారు బైక్ - ఆర్టీసీ బస్సు ఢీ

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న మోటారు బైకు, ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన సోమవారం గువ్వాడి గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఉదయగిరి నుంచి ఆర్టీసీ బస్సు ప్రకాశం జిల్లా పామూరుకు వెళ్తుండగా గ్రామ సమీపంలోని మలుపు వద్ద కాంచెరువు గ్రామానికి చెందిన మందలపు కొండపనాయుడు దంపతులు వరికుంటపాడు నుంచి మోటారుబైకుపై స్వగ్రామానికి వస్తూ ఒక్కసారిగా ఎదురు పడడంతో ఆ వాహనాలు ప్రమాదవశాత్తు ఢీకొన్నాయి. దీంతో ఆ దంపతులకు గాయాలవడంతో చికిత్స నిమిత్తం పామూరుకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


గాయపడిన లెక్కల ప్రసాద్

కలిగిరి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కలిగిరి-వింజమూరు రహదారిలోని నాగిరెడ్డిపాలెం సెంటర్ వద్ద సోమవారం మోటార్‌సైకిల్‌ను కారు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో వీర్నకొల్లు గ్రామానికి చెందిన లెక్కల ప్రసాద్, మద్దినేని శ్రీను తీవ్రంగా గాయపడ్డారు. అలాగే కారులోని మహిళకు స్వల్పగాయాలయ్యాయి. కలిగిరి నుండి స్వగ్రామానికి వెళుతుండగా గుంటూరు నుండి బద్వేలు వెళ్తున్న కారు వెనకనుండి వచ్చి బైక్‌ను ఢీకొనడంతో సెంటర్‌లోని ఓ దుకాణంలోకి దూసుకెళ్లింది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరించి, కేసు నమోదు చేశారు. తీవ్రంగా గాయపడిన వారిని 108 వాహనంలో మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం కావలిలోని ప్రవేటు వైద్యశాలకు తరలించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి



ఆత్మకూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడకండ్ల గ్రామ శివారు ప్రాంతంలో పేకాట స్థావరంపై సోమవారం దాడిచేసి నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నామని ఎస్‌ఐ షేక్ జిలాని తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 10,500 నగదు, నాలుగు మోటారుసైకిళ్ల స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ఫ్లెక్సీ చింపివేశారని ఫిర్యాదు

అనంతసాగరం ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంగుంటలో టీడీపీ ఫ్లెక్సీ చింపివేశారని స్థానిక నాయకుడు పుల్లారెడ్డి స్థానిక పోలీసుస్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈమేరకు విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను కోరారు.

నాడెప్ తొట్టెల ధ్వంసంపై ఫిర్యాదు



కొండాపురం, ఫిబ్రవరి17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్థిని ధ్వంసం చేసిన వారిపై చర్య తీసుకోవాలని ఇస్కదామెర్ల అన్నెం ఇంద్రసేనారెడ్డి, అన్నెం సుబ్బారెడ్డిలు సోమవారం ఎంపీడీవో ఆదినారాయణకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన నాడెప్ తొట్టెలను ఇస్కదామెర్ల సర్పంచ్ ఇరగల శేఖరరెడ్డి ఉద్దేశపూర్వకంగా కూల్చివేశారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

అనాథ మహిళకు ఆదరణ

బిట్రగుంట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ముంగ మూరు జాతీయ రహదారి పక్కన ఉన్న మహిళను సోమవారం భవానీ ఎడ్యు కేషనల్ సొసైటీ సభ్యులు గుర్తించారు. ఆమె ను కేంద్రానికి తీసుకెళ్లి స్నానం చేయించి భోజనం చేయించారు. అనంతరం ప్రథమ చికిత్స అందించారు. ఆమె ఆరోగ్యం కుదుట పడ్డాక వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామన్నారు.

శిథిలావస్థలో విద్యాలయ భవనాలు

● భయాందోళనలో ఉపాధ్యాయులు, విద్యార్థులు


శిథిలమైన మర్రిపాడు హైస్కూల్ భవనం

మర్రిపాడు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డీసీపల్లి, పల్లిపాడు, మర్రిపాడు గ్రామాల్లో ఉన్న విద్యాలయ భవనాలు శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. డీసీపల్లి, పల్లిపాడులోని హైస్కూల్‌లో నాడు-నేడు కార్యక్రమంలో నూతన తరగతి గదులు నిర్మించగా, మర్రిపాడులో హైస్కూల్‌లో విద్యార్థుల సౌకర్యార్థం నూతన భవనాలు నిర్మించడంతో కొంతకాలంగా వాటిలో తరగతులు కొనసాగుతున్నాయి. కాగా, శిథిలావస్థకు చేరిన భవనాలను మాత్రం కూల్చి వేయక పోవడంతో వాటి దరిదాపుల్లోకి వెళ్లేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు భయపడుతున్నారు. భవనాలను కూల్చివేస్తే విద్యార్థులు ఆటలాడుకునేందుకు విశాలమైన ఆట స్థలం ఏర్పడుతుందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల ఆందోళన


ఉదయగిరి: ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఉదయగిరి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్యకర్తలు, ఆయాలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కనీస వేతన చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని, పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఆయాల పదోన్నతికి నిర్దిష్టమైన మార్గదర్శకాలను రూపొందించాలన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కోడె రమణయ్య, గడ్డం నాగేశ్వరరావు, రజియా, ప్రమీలాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

●కావలి టౌన్ : కనీస వేతనం 26వేలు ఇవ్వాలన్న డిమాండుతో సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా చేపట్టారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వారు పెద్దసంఖ్యలో ధర్నాలో పాల్గొని ఆర్డీవో వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె రెహానా బేగం మాట్లాడారు. ఐసీడీఎస్ ఏర్పడి 50ఏళ్లు పూర్తయినా సమస్యల్లో ఏ ఒక్కటి పరిష్కారం కావడం లేదన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కొన్నేళ్ల నుంచి ఉద్యమిస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని వాపోయారు. తక్కువ జీతాలతో ఎక్కువ పనులు చేయించుకుంటూ శ్రమ దోపిడీ చేస్తున్నారని, మెనూ చార్జీలు పెంచడంలేదని, మెడికల్ లీవ్ ఇవ్వడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పెంచులయ్య, కార్యదర్శి కృష్ణమోహన్, సుభాషిణి, విజయలత, వెంకటరమణమ్మ, బిందు, జ్యోతిలక్ష్మి, సౌజన్య పాల్గొన్నారు.

●ఉలవపాడు: అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మండల అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం సీడీఎస్ ప్రాజెక్టు కార్యాయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఎన్నికల ముందు అంగన్‌వాడీల సమస్యలను పరష్కరిస్తామని మాట ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల అనంతరం అంగన్‌వాడీల గురించి పట్టదన్నట్లు వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఆయాల గౌరవ వేతనంను గత ప్రభుత్వం రూ.12వేసి చేసి హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా ఆన్‌లైన్‌లో చేర్చారన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, అన్ని యాప్‌లను ఒకే యాప్ కిందకు తీసుకురావాలని, మట్టి ఖర్చుల కింద రూ.20 వేలు ఇవ్వాలనే డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సీడీపీవో కార్యాలయంలో సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ప్రాజెక్టు లీడర్లు, సీఐటీయూ ఉలవపాడు, గుడ్లూరు కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య


కావలి : వినతిపత్రం ఇస్తున్న వర్కర్స్ యూనియన్ నాయకులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఆయన స్థానిక ఏఐటీయుసీ నాయకులతో కలిసి మున్సిపల్ కమిషనర్ సి గంగాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఏఐటియుసీ ఆధ్వర్యంలో మార్చి 9న చలో విజయవాడ కార్యక్రమానికి పెద్దఎత్తున కార్మికులు తరలివచ్చి ఆందోళన చేపడతామన్నారు. ఈకార్యక్రమంలో ఏఐటీయుసీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మధు, ఆత్మకూరు మున్సిపాల్టీ ఏఐటీయుసీ నాయకులు బి హజరత్తయ్య, షేక్ మునీర్‌బాషా, జె నాగరాజు, ఎం చెంచయ్య, కె నాగేంద్ర పాల్గొన్నారు.

● కావలి : ఆప్కాస్‌ను రద్దు చేసి మున్సిపల్ కార్మికులను ప్రయివేట్ ఏజెన్సీ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్‌కు అప్పగించాలన్న ప్రభుత్వ ప్రతిపాదికన తగదని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మాల్యా అంకయ్య అన్నారు. ఈ విషయంపై సోమవారం ఆయన సంఘం సభ్యులతో కలిసి మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కావలి పారిశుధ్య, ఇంజనీరింగ్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, పర్మినెంట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న సరెండర్‌లీవ్‌లు, డీఏలు విడుదల చేయాలన్నారు. గత సమ్మె కాలంలో ఇచ్చిన హామీల మేరకు ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని, జనాభా ప్రాతిపదికన కార్మికులను పెంచాలని కోరారు.

●కందుకూరు: స్థానిక మున్సిపాలిటీలోని పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు సోమవారం కమిషనర్ అనూషను కలిసి వినతపత్రం అందజేశారు. పట్టణంలో పెరిగిన జనాభా ప్రాతిపదికన పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని, పీఎఫ్, హెల్త్‌కార్డులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు బూసి సురేష్‌బాబు, ఎస్‌ఏ గౌస్, ఆనంద్‌మోహన్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కాకుమాని రమణమ్మ, పులి నాగేశ్వరరావు, ఎద్దు కొండమ్మ, శేషమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూ ఆక్రమణదారులపై చర్య తీసుకోండి

● ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమంలో సబ్ కలెక్టరుకు వినతి

కందుకూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కందుకూరు సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజకు సోమవారం ప్రజావిజ్ఞప్తుల కార్యక్రమంలో పలువురు వినతులు అందజేశారు. వలేటివారిపాలెం మండలం అయ్యవారిపల్లిలోని ప్రభుత్వ భూమిని కొందరు పలుకుబడి కలిగిన వ్యక్తులు ఆక్రమించి దానిపక్కనే ఉన్న తమ స్వంత భూమిలో కలిపి ప్లాట్లు వేసి అమ్మేస్తున్నారని షేక్ హుస్సేన్ ఫిర్యాదు చేశారు. అలాగే దాని సమీపంలోని మరో 5 ఎకరాలను ఆక్రమించి ఇటుక బట్టీలు నిర్వహిస్తూ వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. గుడ్లూరు మండలం దారకానిపాడులోని కుంటపోరంబోకు భూమిని ఆక్రమించి అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నట్లు గౌడపేరు రాము ఫిర్యాదు చేశారు. రెండు భూ ఆక్రమణలపై తక్షణం చర్యలు తీసుకోవాల ని ఆమె అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయ్యవారిపల్లిలో ఫారెస్టు అధికారులతో కలిపి జాయింట్ సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని, దారకానిపా డులో అక్రమ నిర్మాణాలను తక్షణం కూల్చివేయాలని ఆదేశించారు.

'రామదూత' ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకోవాలి


ప్రజలనుంచి అర్జీ తీసుకుంటున్న సబ్ కలెక్టరు

గుడ్లూరు మండలం చేవూరు సమీపంలో అనాథ పిల్లల పాఠశాల పేరుతో రామదూత స్వామి ఆక్రమించిన చెరువు పోరంబోకు భూమిని, అటవీ భూమిని తక్షణం స్వాధీనం చేసుకోవాలని హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2021లో రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆ భూముల అలైనేషన్ రద్దు చేసి తక్షణం స్వాధీనం చేసుకోవాలని జారీ చేసిన ఉత్తర్వులను నేటివరకు స్థానిక అధికారులు అమలు చేయటం లేదని పేర్కొన్నారు.

గిరిజనుల శ్మశాన స్థలంలో ఆక్రమణలు తొలగించాలి

ఉలవపాడు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కరేడు పంచాయతీ రామకృష్ణాపురం గిరిజన కాలనీవాసులకు కేటాయించిన శ్మశాన స్థలం కబ్జాకు గురైందని తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శిలకు పలుమార్లు వినతిపత్రాలు అందించినా పట్టించుకోవడం లేదని సీఐటీయూ మండల నాయకులు పొన్నం రామలక్ష్మమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం గిరిజన సంఘం బాధితులు, సీఐటీయూ నాయకులతో కలిసి ఆక్రమణకు గురైన శ్మశాన స్థలాన్ని పరిశీలించారు. శ్రీనివాసులరెడ్డి, బ్రహ్మయ్యలు ఈ స్థలంలో జామాయిల్ మొక్కలు సాగు చేసుకున్నారని చెప్పారు. ఏళ్ల తరబడి అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవడం లేదని ఈ విషయాన్ని గిరిజన సంక్షేమ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసే వరకు ఉద్యమం చేస్తామన్నారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

దుత్తలూరు (ఉదయగిరి), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడలో సోమవారం రూ.5 లక్షల నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కదిరి వెంకట రంగారావు, కిసాన్‌మోర్చా జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రినాయుడు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధితో పాటు మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు.

బడ్జెట్‌కు వ్యతిరేకంగా వామపక్ష పార్టీల ఆందోళన



ఆందోళన చేస్తున్న వామపక్ష పార్టీల నేతలు

కావలిటౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా వామపక్ష పార్టీల నాయకులు సోమవారం బ్రిడ్జికూడలిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. సీపీఎం జిల్లా కమిటి సభ్యులు కత్తి శ్రీనివాసులు, సీపీఐ జిల్లా నాయకులు బలిజేపల్లి వెంక టేశ్వర్లు మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు వేలకోట్లు దోచిపెట్టేందుకే అని ఆరోపించారు. విభజన హామీల ప్రస్తావనే లేదన్నారు. ధనవంతులకు రాయితీలు ప్రకటించి పేదలపై భారాలు మోపారని విమర్శించారు. బీమా రంగంలో నూరు శాతం ప్రైవేట్ పెట్టుబడులు పెట్టేందుకు కేంద్రం ప్రయత్నిస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచులయ్య, సీపీఐ కార్యదర్శి నాగరాజు, శ్యామల, మధుసూదన్‌రావు, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుడికి ఉపయోగపడని కేంద్ర బడ్జెట్

బిట్రగుంట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యుడికి ఉపయోగపడేది కాదని సీపీఎం, బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం వారు బోగోలు ఇబ్రహీంపేటలోని సీపీఎం కార్యాలయంలో పార్టీ సీనియర్ నేత తుమ్మలవెంకయ్య ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశం మాట్లాడారు. రైతన్నలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. ధాన్యానికి మద్దతు ధర సాధించేందుకు ఈ నెల 22న నెల్లూరులో జరుగు చలో నెల్లూరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నేతలు గడ్డంమాల్యాద్రి, రావిమాల్యాద్రి, ప్రాంతీయ రైతు కమిటీ సభ్యులు పీ.శ్రీనివాసులు బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షులు షేక్‌నూరుద్దీన్ ఉన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

వింజమూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూ సమస్యలు, పట్టణంలోని కాలనీలో ఇంటి పట్టాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం తహసీల్దారు హమీద్‌కు టీడీపీ జిల్లా కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భూసమస్యల వలన ఘర్షణ వాతావరణం ఏర్పడుతోందని, తక్షణం వాటిని పరిష్కరించాలని ఆయన తహసీల్దారును కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండపల్లి వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి, దిద్దిగుంట శ్రీను, పెరుమాళ్, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతలో అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యం

● ఎంపీడీవో పీ. ఐజాక్ ప్రవీణ్



ఆత్మకూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించి పరిశుభ్రతలో ఆత్మకూరు మండలాన్ని అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యమని ఎంపీడీవో పి ఐజాక్ ప్రవీణ్ సోమవారం తెలిపారు.

? పారిశుధ్యం మెరుగుదలకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.

! మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రతి నెలా మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహిస్తూ ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నాం. మురుగు కాలువలను శుభ్రం చేయడంతో పాటు, వీధుల పరిశుభ్రతకు చర్యలు చేపడుతున్నాం.

? మండలంలో ఎన్ని ఇంకుడు గుంతలు మంజూరయ్యాయి.

! ఎన్‌ఆర్‌జీఎస్ ద్వారా మంజూరైన 397 సోక్‌పిట్స్‌లలో 250 ప్రారంభించాం. 100 పూర్తయ్యాయి. త్వరలో అన్ని ఇంకుడు గుంతల నిర్మాణం పూర్తి చేస్తాం.

? ఎంతమందికి సబ్సిడీ రుణాలు మంజూరయ్యాయి.

! మండలంలోని బీసీ, కమ్మ, కాపు, ఈబీసీ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా 46 మందికి సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరయ్యాయి. ఈనెల 19వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు రుణాలు మంజూరు చేస్తాం.

న్యూస్ బాక్స్

పదిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో-2 ఆనందరావు

కొండాపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మార్చి నెలలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషిచేయాలని మండలవిద్యాధికారి-2 ఆనందరావు ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఆదర్శపాఠశాలలో రికార్డులను తనిఖీచేసి, మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించి ప్రిన్సిపల్ ఖాదర్‌భాషాకు పలు సూచనలిచ్చారు.

ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక


సీనియర్లను సత్కరిస్తున్న రిటైర్డు ఆర్టీసీ ఉద్యోగులు

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కందు కూరు డిపో కమిటీ తృతీయ మహాసభ సోమవారం నిర్వహించారు. డిపో ప్రెసి డెంట్ అద్దంకి సుబ్బారావు అధ్యక్షతన జరిగి న సమావేశంలో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎం. హరిప్రసాదరావు ముఖ్య అతిథిగా పాల్గొని నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్‌కే.గౌస్ బాషాను, కార్య దర్శిగా ఉమ్మడిశెట్టి వెంకటేశ్వర్లు, కోశాధి కారిగా ఎం.ఆదిశేషులను ఎన్ను కున్నారు.

23న లింగసముద్రం మండల సర్వసభ్య సమావేశం

లింగసముద్రం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 23న మధ్యాహ్నం 3గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సోమవారం ఎం పీడీఓ కట్టా శ్రీనివాసులు తెలిపారు. ఎంపీపీ పెన్నా కృష్ణయ్య అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో వివిధశాఖలపై సమీక్ష జరుగుతుందన్నారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పం చులు, మండలస్థాయి అధికారులు, కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

రాష్ట్రస్థాయి కూచిపూడి నృత్య పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కావలి టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కూచిపూడి నృత్య పోటీల్లో నలందా ఒలింపియాడ్ విద్యార్థినులు పర్ణిక ప్రియ, నివృతిప్రియలు ప్రతిభ చూపి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వీరిని సోమవారం డీఎస్పీ శ్రీధర్ అభినందించారు. అనంతరం నలందా విద్యాసంస్థల డైరెక్టర్ ఎండీ వసీం మాట్లాడారు. శ్రీకృష్ణ దేవరాయ జయంతి పురస్కరించుకుని సిటిజన్ వెల్ఫేర్ ఫారమ్ ఫ్రైడ్ ఇండియా కల్చర్ వారు నిర్వహించిన పోటీల్లో చిన్నారులు ప్రతిభ చూపడం జిల్లాకు గర్వకారణం అన్నారు.

నెల్లూరు సిటీ

రూరల్, కోవూరు, సర్వేపల్లి

న్యూస్ బాక్స్

కొనసాగుతున్న బందోబస్తు

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆజాద్ సెంటర్‌లో సోమవారం కూడా పోలీసు బందోబస్తు కొనసాగింది. ఈనెల 15న రాత్రి ఆజాద్ సెంటర్‌లో స్వామి వివేకానంద విగ్రహ ఏర్పాటు జరుగుతున్నప్పుడు రెండు వర్గాల మధ్య వివాదం జరిగిన విషయం తెలిసిందే. దీంతో నగర డీఎస్పీ పీ సింధుప్రియ పర్యవేక్షణలో నగర పోలీసు అధికారులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. రాకపోకలను నిషేధించడంతోపాటు దుకాణాలను మూయించారు.

రాయితీ రుణాలకు దరఖాస్తులు అందజేయాలి

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): బీసీ, ఈబీసీ, కమ్మ, కాపు, బ్రాహ్మణ, రెడ్డి కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నవారు మంగళవారం లోగా ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని ఎంపీడీవో శ్రీహరి ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 200 మంది దరఖాస్తు చేసుకోగా 150 మంది దరఖాస్తులు మాత్రమే అందాయని, మిగిలిన దరఖాస్తు దారులు వారి దరఖాస్తులను అందజేస్తే వాటిని పరిశీలించి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.

త్రైత సిద్ధాంత గ్రంథాలపై గ్రామాల్లో ప్రచారం

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం పట్టణంతోపాటు మండలంలోని చెల్లాయపాళెం, రేబాల గ్రామాల్లో సోమవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు త్రైత సిద్ధాంతం భగవద్గీత అనుబంధ గ్రంధములపై ప్రచారం చేశారు. పలువురికి భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సురమౌళి, సునీల్, సుదర్శనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

విడవలూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): విడవలూరు పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయని, తక్షణం అధికారులు చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల నేత పొన్నలూరు పురందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికలో ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2006వ సంవత్సరంలో విడవలూరు పంచాయతీలో నిరుపేదలైన సుమారు 200 మందికి ఇందిరమ్మకాలనీలో ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. అయితే లబ్ధిదారులు ఇళ్లు కట్టులేకపోవడంతో ఆ స్థలాలు కొద్దికాలం ఖాళీగా ఉన్నాయన్నారు. దీంతో కొందరు వ్యక్తులు ఆస్థలాలను ఆక్రమించుకుని తాత్కాలికంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారన్నారు. దీనివలన పట్టాలు పొందిన పేదలు వీధిన పడాల్సి వచ్చిందన్నారు. రెవెన్యూ అధికారులు చొరవ తీసుకుని ఇళ్ల స్థలాలపై విచారణ జరిపి పేదలకు న్యాయం చేయాలని కోరారు.

22న ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ మార్చిలో నిర్వహించనున్న సూపర్‌కప్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో కోరమండల్ ఫుట్‌బాల్ క్లబ్ తరఫున ఆడేందుకు క్రీడాజట్ల ఎంపికలను ఈనెల 22న నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఎంపిక చేయనున్నట్లు ఆ అసోసియేషన్ ప్రతినిధి ఉమాశంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కల ఫుట్‌బాల్ క్రీడాకారులు ఆరోజు ఉదయం 7 గంటలకు స్టేడియంలో జరిగే ఎంపికలకు హాజరు కావాలన్నారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం నేతలు రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారాలోకేష్‌కు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో వినతిపత్రం అందచేశారు. అనంతరం సంఘం అధ్యక్షుడు రామచంద్రయాదవ్ మాట్లాడుతూ కాంప్లెక్స్ మీటింగ్ హాజరు ఆరు గంటల వరకు పడటం లేదని, దీని వల్ల ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాల విద్యాకమిటీల అభిప్రాయాలు తీసుకున్న తరువాత మాత్రమే మోడల్ స్కూళ్ల ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధ్యాయులు, ఎంఈవోల బదిలీలు, క్రెడిట్ కాని సరెండర్ లీవ్‌లు, ఏపీజీఎల్ఐ, పిఎఫ్ లోన్స్, పండిట్స్ పదోన్నతులు, డిఈవో పూల్‌లో ఉన్న ఉపాధ్యాయులకు నోషనల్ సీనియారిటీ తదితర అంశాలను పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. మంత్రి మాట్లాడుతూ విద్యాశాఖ కమిషనర్‌తో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

ఆశాజనకంగా పుచ్చ సాగు..!





సాధారణ సాగులో పుచ్చ పంట, (అంతర్‌చిత్రం)లో మల్చింగ్ పద్ధతిలో సాగు చేసిన పుచ్చ

● రైతుల ఆసక్తితో పెరిగిన విస్తీర్ణం

పొదలకూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : మండలంలో పుచ్చ సాగు ఆశాజనకంగా ఉంది. ఈ ఏడాది పుచ్చసాగుపై రైతులు ఆసక్తి చూపడంతో సాగు విస్తీర్ణం పెరిగినట్లు ఉద్యానవన అధికారులు చెబుతున్నారు. గత ఏడాది కేవలం 160 ఎకరాలకే పరిమితమైన పుచ్చ సాగు ఈ ఏడాది సుమారు 500 ఎకరాలకు పైబడి సాగు చేశారు. పుచ్చ విత్తనం ధర సైతం రూ.5వేల పైబడి ఉన్నా రైతులు వెనకడుగు వేయకుండా సాగు చేపట్టారు. మండలంలోని మర్రిపల్లి, ఇనుకుర్తి, మొగళ్లూరు, కనుపర్తి, ఆల్లూర్తి, ఆర్‌వై పాలెం, అంకుపల్లి, ఊసపల్లి తదితర గ్రామాల్లో పుచ్చ సాగు చేస్తున్నారు. ఒక్క మొగళ్లూరులోనే సుమారు వంద ఎకరాల్లో సాగు చేపట్టారు. కొందరు రైతులు మల్చింగ్ (పాలిథిన్ కవర్లు) పద్ధతిని పాటించడం వల్ల గడ్డి సమస్య లేకుండా రైతులు జాగ్రత్త పడుతుండగా సాధారణంగా సాగు చేసిన రైతులు గడ్డితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● సాగు విధానం

పుచ్చ పంటను వ్యవసాయ భూముల్లో నేరుగా వేసుకోవచ్చు. లేదంటే వివిధ తోటల్లో అంతర పంటగా దీనిని సాగు చేసుకోవచ్చు. ఎకరానికి 80 నుం చి 90 రోజుల వ్యవధిలో రూ.60వేలు పైచిలుకు నికర ఆదాయం పొంద వచ్చు. మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాల్సి ఉంటుంది. విత్తనం సాగుచేసే దశ నుంచే రైతులు అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా తెగుళ్ల పీడను గుర్తించాలి. ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి.. తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుసుకోవడం ఉత్తమం. రసాయన ఎరువులను అధికంగా వినియోగించకుండా సేంద్రియ ఎరువులను వాడడం ద్వారా కూడా మంచి దిగుబడి పొందవచ్చునని అధికారులు చెబుతున్నారు.

రైతులకు అండగా ఉంటా : ఎమ్మెల్యే సోమిరెడ్డి



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

తోటపల్లి గూడూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా ఉండి వారి సమస్యలు పరిష్కరిస్తానని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. కృష్ణపట్నం నుంచి హైదరాబాదు వరకు నిర్మిస్తున్న పెట్రోల్ పైపులైన్‌ని సోమవారం అయన మండలంలోని పేదూరు గ్రామంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంట చేతికి వచ్చేంతవరకు పైపులైన్ల నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలిపివేయాలని తెలిపారు. ఈ విషయంపై కేంద్ర మంత్రులతో మాట్లాడుతానని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తానన్నారు. ఈ విషయంపై రైతులు ఆధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, మండలాధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షుడు సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నాయకులు రేవత్‌రెడ్డి, మన్యం జితేంద్ర, నిమ్మల రమేష్‌గౌడ్, ముత్యాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

● సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

మనుబోలు : వీరంపల్లికి చెందిన యనమల వాసుకి సోమవారం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సీఎం సహాయనిధి చెక్కు అందజేశారు. ఇటీవల వడ్లపూడి వద్ద బస్సులో జరిగిన అగ్నిప్రమాదంలో వాసు తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో వాసుకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.2 లక్షల 2వేల చెక్కును నెల్లూరులోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో వీరంపల్లి టీడీపీ నాయకులు మన్నారపు రఘురామయ్య, పొట్టేళ్ల ప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మూడు కారణాలతో అనారోగ్యం : మంత్రి నారాయణ



రోగులతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలు వివిధ వ్యాధుల బారిన పడుతున్నారంటే అందుకు మూడు కారణాలు ప్రధానమని మున్సిపల్‌శాఖామంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. సోమవారం నగరంలోని సుబేదారుపేట పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అందుతున్న వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రధానంగా సాలిడ్ వేస్ట్, ఇళ్ల నుంచి వచ్చే లిక్విడ్ వేస్ట్, ఆసుపత్రులను నుంచి వచ్చే బయోమెడికల్ వేస్ట్ కారణంగా వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. వీటిని అరికట్టేందుకు సీఎం చంద్రబాబు ఆదేశాలతో మేరకు వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌ను, షివరేజ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. నగరంలో వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌కు టెండర్లు పిలిచామన్నారు. ఈ ఏడాది అక్టోబరులోగా చెత్తదిబ్బ లేకుండా చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై 20న విచారణ

● పంచాయతీ పూర్వపు కార్యదర్శులకు నోటీసులు

పొదలకూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పొదలకూరు గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగం అయినట్లు వచ్చిన ఆరోపణలపై ఈనెల 20వ తేదీన విచారణ ఉన్నతాధికారులు విచారణ చేపట్టనున్నారు. ఈ విచారణకు హాజరుకావాలని పూర్వం ఇక్కడ పనిచేసిన పంచాయతీ కార్యదర్శులకు సోమవారం నోటీసులు అందాయి. గత ప్రభుత్వంలో 2020 జనవరి నుంచి ఇప్పటి వరకు పంచాయతీ నిధులు దుర్వినియోగమైనట్లు జిల్లా పంచాయతీ అధికారికి ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని, సంబంధిత నివేదిక ఇవ్వాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి జిల్లా పంచాయతీ అధికారిని కోరారు. దీంతో 20వ తేదీ అన్ని రికార్డులను పరిశీలించి విచారణ చేసేందుకు గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శులందరూ సిద్ధంగా ఉండాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీ పాలకవర్గం వైసీపీ వారిదే ఉండడంతో అనేక అక్రమాలకు పాల్పడినట్లు ఆధారాలతో ఆ వ్యక్తి ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

రూరల్ పోలీసు స్టేషన్‌లో ట్రైనీ డీఎస్పీ



పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ట్రైనీ డీఎస్పీ శివప్రియ

నెల్లూరురూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో సోమవారం శిక్షణలో ఉన్న డీఎస్పీ ఏ శివప్రియ రైటర్ విధులు నిర్వహించారు. మరో స్టేషన్‌లో కానిస్టేబుల్ విధులు పూర్తవడంతో రైటర్ విధులను ఈనెల 21 వరకు ఇక్కడ నిర్వహించనున్నారు. మహిళల్లో ఆత్మస్థైర్యం, పోటీతత్వం, ఓర్పు పెంపొందించేందుకు తన వంతు కృషి అందిస్తానని ఆమె తెలిపారు.

ఏపీలో భవిష్యత్ టీడీపీదే : ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



టీడీపీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఏపీలో రానున్న భవిష్యత్ టీడీపీదేనని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం నెల్లూరులోని తన కార్యాలయంలో కాకుపల్లి మాజీ సర్పంచి, వైసీపీ నాయకుడు కనిమెల రమణయ్యతోపాటు మరి కొందరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నెల్లూరురూరల్‌లోని పంచాయతీలు, మున్సిపల్ డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. అనంతరం గొల్లకందుకూరు, 20వ డివిజన్లలో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కాగా కలివెలపాళెంలో టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి గడప గడపకు యాత్ర కొనసాగింది.

● ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి): స్థానిక రాజరాజేశ్వరి ఆలయంలోని సుందరేశ్వర స్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాలు ఈ నెల 24 నుంచి 28 వరకు జరుగుతాయి. కార్య క్రమంలో జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, అర్చకులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌తోనే శాస్త్రీయ దృక్పథం : జడ్పీ చైర్‌పర్సన్



నమూనాలను పరిశీలిస్తున్న ఆనం అరుణమ్మ

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలంటే సైన్స్‌తోనే సాధ్యమవుతుందని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం స్మైల్ ఫౌండేషన్ నిర్వాహకులు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో నిర్వహించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఆమె పాల్గొని మాట్లాడారు. హైస్కూల్ విద్యార్థులకు భవిష్యత్ కోసం అవసరమైన ఆలోచన, సమస్య పరిష్కారం, విశ్లేషాత్మకమైన నైపుణ్యాలను అందించడానికి ఈ కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. జిల్లాలో 53 ఎంపిక చేసిన పాఠశాలల్లో 10 పాఠశాలలకు రూ.2లక్షల విలువైన ప్రత్యేక ల్యాబ్‌లను నిర్వాహకులు అందించడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థుల ప్రాజెక్ట్‌లను ఆమె పరిశీలించి, అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి, ఇతర అధికారులు, సైన్స్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

రాపూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాపూరు, సైదాపురం, కలువాయి మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సెక్రటరీ సురేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అంగన్‌వాడీలను పట్టించుకోలేదని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అంగన్‌వాడీల సమస్యలపై దృష్టి పెట్టి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు యూనియన్ అధ్యక్షురాలు జయసుధ, కార్యదర్శి ప్రమీల, కోశాధికారి లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ముస్లింల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ముస్లింలు

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ సోమవారం ముస్లిం నేత సయ్యద్ సమీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ముస్లింలు నిరసన వ్యక్తం చేశారు. ముందుగా నగరంలోని కోటమిట్ట మసీదు నుంచి కలెక్టరేట్ వరకు ముస్లిం ఐక్య వేదిక నాయకులు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. జేసీ కార్తీక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సయ్యద్ సమీ మాట్లాడుతూ వక్ఫ్ చట్ట సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని, దీన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి నేతలు ఎన్నికల అప్పుడు ముస్లింలకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారని, ఈ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో ముస్లిం నేతలు ఖలీల్‌అహ్మద్, అంజా హుస్సేనీ, జుబేర్, జియావుల్హక్, ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరకు చట్టం చేయాలి : సీపీఎం



సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం శ్రేణులు

నెల్లూరురూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : గిట్టుబాటు ధరకు చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు సోమవారం ఆందోళన నిర్వహించారు. మండలంలోని అన్నీ గ్రామ పంచాయతీ సచివాలయాల వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి పూడిపర్తి జనార్ధన్, జిల్లా కమిటీ సభ్యుడు తిరుపాలు మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, వాటిని చట్టం పరిధిలోకి తీసుకురావాలన్నారు. రైతులు పండించే అన్నీ పంటలకు గిట్టుబాటు ధర ఉండాలని తెలిపారు. అన్నీ గ్రామాల్లో యుద్ధప్రాతిపదికన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెంచయ్య, సుబ్రహ్మణ్యం, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ అర్జీపై స్వీయపరిశీలన ఉండాలి : ఏడీసీ



పీజీఆర్ఎస్‌లో అర్జీలపై ఆరా తీస్తున్న ఏడీసీ

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నగర వాసుల నుంచి వివిధ సమస్యలపై అందే అర్జీలపై అధికారుల స్వీయపరిశీలన ఉండాలని ఏడీసీ నందన్ తెలిపారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పీజీఆర్ఎస్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర వాసుల నుంచి వినతులు స్వీకరించారు. పౌరులు తమ సమస్యలను తెలుపుతూ ఇచ్చిన వినతులను క్షేత్ర స్థాయికి వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. తద్వారా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఒక్కసారి వచ్చిన వినతి మరోసారి రాకుండా జాగ్రత్తపడాలనితెలిపారు.

మున్సిపల్ పాఠశాలలను అభివృద్ధి చేయాలని వినతి

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): అన్నీ మున్సిపల్ పాఠశాలలను అభివృద్ధి పరచాలని మున్సిపల్ శాఖామంత్రి పొంగూరు నారాయణను రిపబ్లిక్ టీచర్స్ అసోసియేషన్(ఆర్‌టీఏ) నేతలు కోరారు. ఈ మేరకు సోమవారం నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందచేశారు. అనంతరం ఆర్‌టీఏ అధ్యక్షుడు షేక్.ఖాజారహంతుల్లా మాట్లాడుతూ ప్రస్తుతం మున్సిపాలిటీలోని అన్నీ పాఠశాలలను పరిగణలోకి తీసుకుని అభివృది చేయాలని కోరారు. అధికారులతో చర్చించి అన్నీ పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీఏ ప్రధాన కార్యదర్శి కోలా కిరణ్, సభ్యులు పాల్గొన్నారు.



మంత్రి నారాయణకు వినతిపత్రం అందిస్తున్న ఆర్‌టీఏ అధ్యక్షుడు ఖాజారహంతుల్లా తదితరులు

నగరంలో పారిశుధ్యం అధ్వానం

● అధికారులు తీరుపై మంత్రి నారాయణ ఆగ్రహం ● శానిటేషన్ బాధ్యతలు ఏడీసీకి అప్పగింత

● కోఆర్డినేషన్ చేసుకోవాలని ఎంహెచ్‌వోకి హితవు ● కార్పొరేషన్‌లో వాడివేడిగా సమీక్ష

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : 'నెల్లూరు నగరంలో పారిశుధ్యం ఏమాత్రం బాగాలేదు... మీకు ఇష్టం లేకపోతే వెళ్లిపోండి... ఏ విషయం ఇప్పుడే చెప్పేయండి'..! అని ఆరోగ్య విభాగం అధికారులపై మున్సిపల్‌శాఖామంత్రి పొంగూరు నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నగర కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ సూర్యతేజతో కలిసి పలు విభాగాల అధికారుల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. మొదటగా పారిశుధ్యంపై మాట్లాడిన మంత్రి శానిటేషన్ అధికారుల తీరు నచ్చడం లేదన్నారు. ఇప్పటి నుంచి పారిశుధ్య పర్యవేక్షణ బాధ్యతలు ఏడీసీ నందన్‌కు అప్పగిస్తున్నట్లు వెల్లడించారు. ఆయనకు మరోపని చెప్పవద్దంటూ కమిషనర్‌కు సూచించారు. ఎంహెచ్‌వో చైతన్య కేవలం ఏడీసీతో కోఆర్డినేషన్ చేసుకోవాలని స్పష్టం చేశారు. త్వరలో మార్పు కనిపించాలని ఆదేశించారు. యూజీడీ, తాగునీటి పెండింగ్ పనులపై ఎల్‌అండ్‌టీ కంపెనీ ప్రతినిధులతో అక్కడ నుంచే మాట్లాడిన ఆయన 2014-19 మధ్య కాలంలో పరుగులుతీసిన ప్రగతి కనిపించాలని పేర్కొన్నారు. పారిశుధ్యంలో నూతన వాహనాల ప్రవేశంపై ఇంజనీరింగ్ అధికారులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రి వివరాలు వెల్లడించారు. అనంతరం సిటీప్లానింగ్ అధికారులతో సమీక్షించారు. ఒక్కో అధికారి వద్ద షాట్ ఫాల్స్(అపరిష్కృత దరఖాస్తులు) ఎందుకు పెండింగ్ ఉంటున్నాయని సూటిగా ప్రశ్నించారు. వీటిపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

● క్రీడా మైదానం పరిశీలన

అంతకు ముందు సంతపేటలోని గుంటబడి వద్దకు వెళ్లిన మంత్రి నారాయణ అక్కడ క్రీడా మైదానాన్ని పరిశీలించారు. పిల్లలు ఆడుకునేందుకు వీలుగా ప్లే, జిమ్ పరికరాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అన్నీ పాఠశాలలో ఆటస్థలాలను సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమాల్లో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై ఇంటింటా సర్వే



చిన్నారుల ఆరోగ్య వివరాలు సేకరిస్తున్న ప్యానల్ న్యాయవాది రమేష్

సైదాపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఉత్తర్వులు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు చిన్నారుల ఆరోగ్యంపై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు ప్యానల్ న్యాయవాది పి రమేష్ తెలిపారు. సర్వేలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని మన్నారపు సిద్దయ్య గిరిజన కాలనీలో ఇంటింటికీ వెళ్ళి మతి స్థిమితం లేని, దీర్ఘకాలికంగా అనారోగ్యానికి గురైన పిల్లలను గుర్తించి వివరాలు సేకరించారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఈనెల 24వ తేదీ వరకు సర్వే జరుగుతుందని, సేకరించిన వివరాలను జిల్లా న్యాయాధికార సేవా సంస్థకు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం శ్రీలత, ఆశా వర్కర్ అరుణమ్మ, అంగన్‌వాడీ టీచర్ సుజాత పాల్గొన్నారు.

టీచర్ సుబ్బయ్య సేవలు చిరస్మరణీయం

పొదలకూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు దివంగత నరసాపురం సుబ్బయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక ఏపీటీఎఫ్ భవన్‌లో ఇటీవల మృతి చెందిన రిటైర్డ్ టీచర్ సుబ్బయ్య సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సుబ్బయ్య ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరుగని పోరాటం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అధ్యక్షుడు మాల్యాద్రిరెడ్డి, ప్రధానకార్యదర్శి శ్రీనివాసులు, రిటైర్డ్ హెచ్‌ఎం కోటేశ్వరరావు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



సుబ్బయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

సాయిభరత్‌కు డాక్టరేట్ ప్రదానం

వెంకటాచలం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వీఎస్‌యూలో మేనేజ్‌మెంట్ ఫ్యాకల్టీలో బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలోని పరిశోధక విద్యార్థి కంచి సాయిభరత్‌కి వీఎస్‌యూ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈయన ప్రాస్పెక్ట్స్ అండ్ చాలెంజ్స్ ఫేసడ్ బై ది న్యూ ఎంటర్ప్రెనేర్స్ ఆఫ్ ఎంఎస్ఎంఈ - ఏ స్టడీ విత్ రిఫరెన్స్ టూ ఎస్‌పీఎస్ నెల్లూరు డిస్ట్రిక్ట్, ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై డాక్టర్ పీ చెంచురెడ్డి పర్యవేక్షణలో పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసి ప్రచురించారు. దీంతో సోమవారం సాయిభరత్‌కు వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు పీహెచ్‌డీ పట్టాను అందచేశారు. ఆయనను వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు, తదితరులు అభినందించారు.

సర్వీస్ ప్రొవైడర్లకు శిక్షణ

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : సర్వీస్ ప్రొవైడర్లకి మెప్మా ద్వారా శిక్షణ ఇస్తామని పీడీ రాధమ్మ చెప్పారు. సోమవారం నగరంలోని ఆమె చాంబర్‌లో శిక్షణ ఇవ్వడానికి ఎంపికయిన ట్రైనింగ్ పార్టనర్లతో సమీక్ష జరిగింది. ఈ సమీక్షలో ఆమె మాట్లాడుతూ అన్నీ సెంటర్లవారు ఈ నెల 20వతేదీకల్లా శిక్షణను ప్రారంభించాలన్నారు. అన్ని సెంటర్లలో మౌలిక వసతులు కల్పించాలని, శిక్షణకి కావాల్సిన అన్నీ ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. సమావేశంలో కాంతయ్య, సుధాకర్, అంకయ్య, సుధాకర్, హర్షిత, తదితరులు పాల్గొన్నారు.



దిగ్గజాలు దిగివచ్చారు. ధార్మికవేత్తలు ఏతెంచారు. సంప్రదాయ వాయిద్యాలు హోరెత్తాయి. వేడుకగా అంతర్జాతీయ ఆలయాల సదస్సు ఉత్సవంలా మొదలైంది. ఇంటర్నేషనల్ టెంపుల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో- 2025 సందడితో తిరుపతి కళకళలాడింది. సోమవారం సాయంత్రం ప్రారంభ వేడుకకు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గోవా ముఖ్యమంత్రులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆరెస్సెస్ ప్రముఖులు, దేశంలోని ప్రసిద్ధ ఆలయాల నిర్వాహకులు, వివిధ రాష్ట్రాల అధికారులు పాల్గొన్నారు. ఆశా కన్వెన్షన్‌లో మరో రెండు రోజుల పాటూ ఈ సదస్సులు కొనసాగుతాయి. సదస్సుకు అనుబంధంగా జరుగుతున్న ఆలయాల భద్రత, నిర్వహణకు ఉపకరించే పరికరాలు, భారతీయ సంప్రదాయ వస్త్ర, చిత్రాల ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది.









ఆలయోత్సవం

తిరుపతిలో వేడుకగా ప్రారంభం


ముగ్గురు సీఎంలు, ఐదుగురు మంత్రులు, ఆర్‌ఎస్‌ఎస్ ముఖ్యులు, వీహెచ్‌పీ ప్రముఖులు,ఆధ్యాత్మిక వక్తలు,ఆలయ ట్రస్టీలు, అధికారులు, నిపుణులు.. ఒక చోట కలిశారు. ఇంతమంది ప్రముఖులు హాజరవుతున్న సదస్సు గురించి ఒక రోజు ముందుగానే జిల్లావాసులకు తెలిసింది.ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో (ఐటీసీఎక్స్-2025)పేరిట టెంపుల్ కనెక్ట్ సంస్థ నిర్వహించిన అంతర్జాతీయ ఆలయోత్సవానికి తిరుపతిలోని ఆశా కన్వెన్షన్ వేదికైంది. అంతమంది ప్రముఖులు హాజరయ్యే చోటకు వెళ్లాలని పలువురు ఆసక్తి చూపినప్పటికీ భద్రతాకారణాల నేపథ్యంలో అనుమతి దొరకలేదు.సోమవారం నాటి ప్రారంభ సభకు ముందు అతిథులకు స్వాగతం పలుకుతూ ముంబై నుంచి వచ్చిన సంప్రదాయ కళాకారుల ఆధ్యాత్మిక సంగీత విన్యాసాలు ఓ పవిత్ర వాతావరణంలోకి తీసుకెళ్లాయి. ఒక హాల్లో సభ, మరో హాల్లో వివిధ స్టాళ్లను ఏర్పాటుచేశారు. ఆలయ పరిశుభ్రత, భద్రత, ఆచార వ్యవహారాలకు సంబంధించిన వస్తువులను తయారుచేసే కంపెనీలు ఈ స్టాళ్లలో కనిపించాయి. 17 దేశాల్లోని 1581 దేవాలయాల నుంచి ప్రతినిధులు సదస్సులో భాగస్వామ్యం కానున్నట్టు నిర్వాహకులు చెప్పారు. అయితే 58 దేశాల నుంచి అదనంగా 685 దేవాలయాల ప్రతినిధులు హైబ్రిడ్ ఫార్మాట్‌లో పాల్గొంటారని చెప్పారు.11మందికి పైగా వక్తలు, 15 వర్క్‌షాప్‌లు, 60 ఎగ్జిబిషన్ స్టాల్స్ అంతర్జాతీయ దేవాలయాల సమావేశంలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

శ్రీ వేంకటేశ్వర ఆలయానికి నిలయంగా ఉన్న తిరుపతి ఏటా లక్షలాది మంది భక్తులను ఆకర్షిస్తోందని, ఇది ప్రపంచవ్యాప్తంగా అత్యంత రద్దీగా ఉండే మతపరమైన ప్రదేశాలలో ఒకటిగా మారుతోందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

అందరి నోటా శ్రీవారి ప్రశస్తి

తిరుపతి, తిరుమల ప్రశస్తి, శ్రీవారి వైభవం ఎవరికీ తెలియంది కాదు. తరతరాలుగా తిరుమల, తిరుపతి పుణ్యక్షేత్రాలను, శ్రీవారిని ఎందరో రాజులు, చక్రవర్తులు దర్శించడం, శ్లాఘించడం, విలువైన కానుకలు సమర్పించడమూ కొత్త కాదు. అయినా నేటికీ తిరుపతి వేదికగా ఏ కార్యక్రమం జరిగినా, ఏ ప్రముఖులు పాల్గొని ప్రసంగించినా అందులో తిరుపతి పుణ్యక్షేత్ర ప్రస్తావన, శ్రీవారి వైభవాన్ని ప్రస్తుతించకపోవడమనేది ఉండదంటే అతిశయోక్తి కాదు. సోమవారం సాయంత్రం తిరుపతిలో ప్రారంభమైన ఐటీసీఎక్స్-2025 సదస్సులోనూ అదే ప్రతిబింబించింది. పలువురు వక్తల నోట తిరుపతి పుణ్యక్షేత్రం, తిరుమల శ్రీవారి ప్రశస్తి పలుమార్లు ప్రస్తావనకు వచ్చింది. ఐటీసీఎక్స్ సదస్సుకు తిరుపతి వేదిక కావడం, అందులో పాల్గొనడం తమ అదృష్టమన్న మాటలతోనే ముగ్గురు సీఎంలూ ప్రసంగాలు ప్రారంభించారు.







దేవుడిని పూజించే ప్రతి భక్తుడికీ సహజ సిద్ధమైన గమ్యస్థానంగా తిరుపతి ఆవిర్భవించింది. తిరుమలలో భక్తులకు అన్న ప్రసాదాలు అందించాలనే ఉద్దేశంతో 1985-86లో అప్పటి సీఎం ఎన్టీఆర్ శ్రీవారి అన్నదాన ట్రస్టు ఏర్పాటు చేశారు. ఇపుడా ట్రస్టుకు విరాళాల రూపంలో రూ.3 వేల కోట్ల కార్పస్ ఫండ్ చేరింది. దీనిపై వచ్చే వడ్డీతో తిరుమల, తిరుపతిల్లో టీటీడీ భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేస్తోంది. నేను సీఎంగా గతంలో ప్రారంభించిన శ్రీవారి ప్రాణదాన ట్రస్టుకు ఇపుడు రూ.440 కోట్లు వచ్చాయి. ఆ నిధులతో టీటీడీ ఎందరికో ప్రాణదానం చేస్తోంది. అన్ని రాష్ట్రాల రాజధానుల్లోనూ.. హిందువులున్న ప్రతిదేశంలోనూ శ్రీవారి ఆలయాలు ఉండాలి. తిరుమలలో 75 శాతం గ్రీన్ కవర్ ఉంది. అక్కడ పర్యావరణాన్ని కాపాడేందుకు మరింత పెద్దఎత్తున చర్యలు తీసుకుంటాం. తిరుపతిలో ఐటీసీఎక్స్ నిర్వహిస్తున్న రెండో సదస్సుకు వచ్చిన ముఖ్యులకు శ్రీవారి దర్శనం కల్పించాలని టీటీడీ ఈవోకు చెబుతున్నా.

- ఏపీ సీఎం చంద్రబాబు

58 దేశాల నుంచీ 1500 ఆలయాల నిర్వహణా కమిటీలు పావన నగరమైన తిరుపతిలో సదస్సు చేపట్టడం అద్భుతం. దీనికి నన్ను ఆహ్వానించడం, శ్రీవారి దర్శనం చేసుకుని సదస్సులో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నా. దేశంలో ఆలయ నిర్వహణ అద్భుతంగా అమలవుతున్నది తిరుమల, తిరుపతి దేవస్థానాలలోనే. తిరుపతి, తిరుమల, శ్రీకాళహస్తి, నాగలాపురం వంటి చోట్ల ఆలయాల నిర్మాణానికి, అభివృద్ధికి శక్తిమేరా విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు పాటుపడ్డారు. దక్షిణ భారతాన అద్భుత ఆలయాలు కట్టించారు.

- మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్

ప్రయాగరాజ్‌లో మహాకుంభ్ జరుగుతుంటే.. తిరుపతిలో ఆలయాల కుంభ్ మేళా జరుగుతోంది. ఇందులో పాల్గొనడం అదృష్టంగానే కాక గర్వంగా భావిస్తున్నా.

- గోవా సీఎం ప్రమోద్ సావంత్

ముగ్గురు సీఎంల పర్యటన ప్రశాంతం



తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం చంద్రబాబు, మహారాష్ట్ర, గోవా ముఖ్యమంత్రులు దేవేంద్ర ఫడ్నవీస్, ప్రమోద్‌సావంత్ తదితర ప్రముఖుల తిరుపతి పర్యటన ప్రశాంతంగా సాగింది.ఆశా కన్వెన్షన్ హాలు వద్ద పోలీసులు భారీ భద్రతా చర్యలు చేపట్టారు. వేదిక చుట్టూ పారా మిలటరీ బలగాలను నియమించారు. మంగళం- తిరుపతి రహదారిలో వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. ఎస్పీ హర్షవర్ధనరాజు నేతృత్వంలో ముగ్గురు అదనపు ఎస్పీలు, 10 మంది డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, దాదాపు 800 మంది పోలీసులు భద్రతా విధుల్లో పాల్గొన్నారు. సభాస్థలికి వెళ్లే ప్రతి ఒక్కరినీ తనిఖీ చేసి అనుమతించారు. బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్‌లు అడుగడుగునా తనిఖీలు చేశాయి. రోడ్డులో వెళుతున్న కొందరు అనుమానితులను ముందస్తుగా తనిఖీలు చేసి అదుపులోకి తీసుకుని వదిలి పెట్టారు.

సదస్సులో నేడు..

విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ప్రధాన కార్యదర్శి మిలింద్ పరాండే, తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై, సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ మాజీ ఛైర్మన్ సురేష్ హవారే, గోవా పర్యాటక మంత్రి రోహన్, ఇస్కాన్ కమ్యునికేషన్స్ డైరెక్టర్ గోవింద దాస్ తదితరులు పలు అంశాలపై జరిగే చర్చల్లో పాల్గొననున్నారు.

కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

చంద్రగిరి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు సోమవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. అంకురార్పణలో భాగంగా నవధాన్యాలను నవపాలికల్లో నింపారు. 49 మంది దేవతలను ఆహ్వానిస్తూ వేద మంత్రోచ్చారణతో ఆగమోక్తంగా పూజలు చేశారు. మంగళవారం ఉదయం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 7.30 నుంచి 8 గంటల వరకు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు తిరుచ్చి ఉత్సవం నిర్వహించనున్నారు. 8.15 నుంచి 8.40 గంటల మధ్య మీనలగ్నం నందు ధ్వజారోహణ ఘట్టాన్ని నిర్వహించనున్నారు. సాయంత్రం ఊంజల్ సేవ, రాత్రి 8 పెద్దశేష వాహన సేవ జరుగుతాయి. అంకరార్పణ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, కంకణ భట్టర్ శేషాచార్యులు, అర్చకులు బాలాజీ రంగాచార్యులు, పార్థసారథి, నారాయణచార్యులు, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు మునికుమార్, ధనుశేఖర్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





క్రమశిక్షణ లేకుండా దూసుకెళుతున్న సెక్యూరిటీ

అయినా.. తీరు మారలేదు

● అస్తవ్యస్తంగా ముక్కంటి ఆలయ సెక్యూరిటీ వ్యవస్థ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని సెక్యూరిటీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. తరచూ కొందరు సిబ్బంది పనితీరు విమర్శలకు తావిస్తోంది. వీరివల్ల అప్రతిష్ఠ వస్తోంది. గత వైసీపీ హయాంలో పాలకులు, అధికారులు కలిసి స్వలాభం కోసం వ్యవస్థను గందరగోళంగా మార్చేశారు. అవినీతిమయం చేశారు. రెండేళ్ల కిందట అప్పటి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిపై ఓ సెక్యూరిటీ విభాగం ఇన్‌ఛార్జి బాహాటంగా విమర్శలు చేశారు. ప్రతిరోజు తక్కువ సిబ్బందికి విధులు కేటాయిస్తూ జీతాల బిల్లుల సమయంలో ఎక్కువ నమోదు చేస్తూ ప్రతి నెలా రూ.10లక్షలు స్వాహా చేశారని అప్పట్లో ఆధారాల సహా ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చినా.. కొందరి తీరు మారలేదు. సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యం వీడలేదు. పాత పంథానే కొనసాగిస్తున్నారు. సెక్యూరిటీ వ్యవస్థను గాడిన పెట్టేదిశగా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

వైసీపీ అధికారంలోకి వచ్చాక..

- 2019 వరకు ప్రైవేటు సంస్థలు సెక్యూరిటీ కాంట్రాక్టు దక్కించుకున్నప్పటికీ.. పర్యవేక్షణకు డీఎస్పీస్థాయి విశ్రాంత అధికారిని చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా ఆలయం తరపున నియమించేవారు. 2019 వరకు విశ్రాంత డీఎస్పీ కృష్ణమూర్తి సీఎస్‌వోగా పనిచేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆలయ సూపరింటెండెంట్లకే పర్యవేక్షణ బాధ్యత అప్పగించారు.
- సెక్యూరిటీ గార్డులను నియమించే సమయంలో వారిపై ఎలాంటి కేసులు, నేరాల్లో భాగస్వాములు కాలేదన్న ధ్రువీకరణ తీసుకోవాలి. కానీ గత ప్రభుత్వంలో కేసులున్న కొందరిని నియమించుకున్నారు.
- మూడు షిఫ్టులలో విధులు నిర్వహించే సెక్యూరిటీగార్డుల వివరాలను ఎప్పటికప్పుడు నోటీసు బోర్డులో ఉంచాలి. కానీ, రాతపూర్వకంగా సెక్యూరిటీ హాజరు పుస్తకాలను నమోదు చేసేవారు. తద్వారా ఎక్కువ మంది పనిచేసినట్లు బిల్లులు పెడుతూ సొమ్ము చేసుకునేవారని గతంలో విమర్శలు వెల్లువెత్తాయి. ఇలా ఎన్నో నిబంధనలను గాలికొదిలేశారు.

ముఖ హాజరుతో అవినీతికి చెక్

సెక్యూరిటీ విభాగంలో ముఖ హాజరుతో అవినీతిని అరికట్టవచ్చని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని శాఖల్లో గత ప్రభుత్వంలోనే ముఖ హాజరు విధానం తీసుకొచ్చారు. కానీ ముక్కంటి ఆలయంలో సెక్యూరిటీ, శానిటరీ సిబ్బందికి మాత్రం దీనిని అమలు చేయలేదు. ముఖహాజరు వల్ల ఎక్కువ మందిని చూపే అవకాశం ఉండదని గత పాలకులు దీనిని అమలు చేయలేదన్న విమర్శలున్నాయి. ఇప్పుడు అమలు చేసే విషయమై అధికారులు యోచిస్తున్నారు.

ఇప్పుడూ అదే నిర్లక్ష్యం

కూటమి అధికారంలోకి వచ్చినా సెక్యూరిటీ సిబ్బంది మాత్రం గత నిర్లక్ష్యం, నిబంధనల ఉల్లంఘనను కొనసాగిస్తూనే ఉన్నారు. రెండు నెలల కిందట ఐదుగురు సెక్యూరిటీ సిబ్బంది సెల్‌ఫోన్‌లో రీల్స్ చూస్తుండగా ఈవో బాపిరెడ్డి పట్టుకుని విధుల నుంచి తొలగించారు. చేతివాటం ప్రదర్శిస్తున్న సూపర్‌వైజర్లు శీనయ్య, చంద్ర, శ్యామ్‌నూ విధుల నుంచి తొలగించగా.. ఆ తర్వాత రాజకీయ ఒత్తిడితో వీరు యథావిధిగా విధుల్లో చేరారు. మరో సెక్యూరిటీ సూపర్‌వైజర్ షణ్ముగం గతంలో భరద్వాజ తీర్థంలో మద్యం తాగుతూ పట్టుబడినట్లు, త్రినేత్ర అతిథి గృహంలోని డార్మెటరీలో విందు భోజనాలు చేస్తూ అధికారులకు చిక్కినట్లు గుర్తించిన ఈవో.. ఇకపై తీరు మార్చుకోవాలని 20 రోజుల కిందట మందలించారు.



అక్రమార్జనే ప్రధానంగా..!

వైసీపీ హయాంలో షిఫ్టులవారీగా డ్యూటీలు కేటాయించే సూపర్‌వైజర్లు తమకు ఇష్టమైన వారిని ఆదాయం వచ్చే చోట్ల నియమించుకునేవారు. ఆ సొమ్మును పంచుకునేవారు.ఇక,ఐదేళ్ల వైసీపీ పాలనలో చాలాసార్లు సెక్యూరిటీ గార్డులు,సూపర్‌వైజర్లు దళారీ అవతారం ఎత్తి అధికారులకు పట్టుబడటం..కొందరిపై వేటు పడిన సందర్భాలూ ఉన్నాయి.నిబంధనల ప్రకారం ఆరుగురు సూపర్‌వైజర్లు ఉండాలి.కానీ, 12మందిని అప్పట్లో నియమించుకున్నారు.సూపర్‌వైజర్ల తీరుపై చాలా కాలంగా ఆరోపణలు వస్తున్నా.. అధికారులు కనీస చర్యలు తీసుకోలేదు.ఏడాది కిందట ఓ సూపర్‌వైజర్ భరద్వాజ తీర్థంలోబహిరంగంగా మద్యం తాగుతూ అధికారులకు పట్టుబడిన వైసీపీ నేతల అండ ఉండటంతో అతడిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

సెక్యూరిటీ తీరుపై భక్తుల ఆవేదన

విధులకు హాజరయ్యే సమయంలో సెక్యూరిటీ సిబ్బంది దురుసుగా దూసుకెళ్లడంపై భక్తులు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల కిందట మధ్యాహ్నం విధులకు హాజరయ్యే సమయంలో కొందరు సిబ్బంది తమ విభాగం కార్యాలయంలోకి ఒకసారిగా దూసుకెళ్లడంపై భక్తులు ఆశ్చర్యానికి గురయ్యారు. భక్తుల్లో అక్కడ ఏం జరిగిందోనన్న ఆందోళన కలిగింది. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

మహారాష్ట్ర సీఎంను కలిసిన టీటీడీ ఈవో



శ్రీవారి దర్శనం కోసం వచ్చిన మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను సోమవారం టీటీడీ ఈవో శ్యామలరావు తిరుమలలోని పద్మావతి అతిథిగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నవీ ముంబైలో శ్రీవారి ఆలయ నిర్మాణంపై దేవేంద్ర ఫడ్నవీస్‌తో చర్చించారు. ఆలయ నిర్మాణానికి ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోయి త్వరతగతిన నిర్మాణం జరిగేందుకు సహకరించాలని ఈవో కోరగా, మహారాష్ట్ర సీఎం సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, సౌరభ్ హెచ్‌బోరా పాల్గొన్నారు.

-తిరుమల, ఆంధ్రజ్యోతి

ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.20 లక్షల విరాళం

తిరుమల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు సోమవారం రూ.20 లక్షలు విరాళంగా అందాయి. పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన వెంకటరమణ రూ.10 లక్షలు, తిరుపతికి చెందిన సాధు పృథ్వీ రూ.10 లక్షలు చొప్పున విరాళం డీడీలను తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.



అదనపు ఈవోకు డీడీ అందజేస్తున్న సాధు పృథ్వీ

శ్రీహరి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 15 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.77 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 60,203

తలనీలాలు సమర్పించినవారు: 21,793






ఇక్కడ అడుగు పెట్టగానే కాశీ విశ్వేశ్వరుడే కాదు సకల దేవతామూర్తులూ దర్శనమిస్తారు. అందుకే దక్షిణ కాశీగా భక్తుల మనసులో ఆధ్యాత్మిక ముద్ర వేసుకుంది.. నగరి మండలం బుగ్గఅగ్రహారంలోని అన్నపూర్ణసమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం శతాబ్దాలుగా ఇతిహాస,చరిత్రలకు సాక్షిగా నిలుస్తోంది. ఈ దివ్యధామం గురించి తెలుసుకుంటే...

- నగరి, ఆంధ్రజ్యోతి

బుగ్గ అగ్రహారం భూకైలాసం

కొలువు దీరిన కాశీ విశ్వేశ్వరుడు



కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ గోపురం - దోనె నుంచి తీర్థం నీరు

సప్త రుషుల్లో ఒకరైన గౌతమి మహర్షి దేశసంచారంలో భాగంగా బుగ్గ అగ్రహారం వద్ద సేదతీరారని ఇతిహాసగాథ ప్రచారంలో ఉంది. గంగా తీరాన కాశీఆలయం తరహాలోనే ఇక్కడి కుశస్థలీ నది ఒడ్డున వాతావరణం పోలి ఉన్నట్టు ఆయన గుర్తించారు.



ఆలయ ముఖద్వారం

దక్షిణభాగంలోనూ ఇది కాశీగా భాసిల్లుతుందని భావిచారట. పాండవులు వనవాస సమయాన ఈ ప్రాంతంలో సంచరించి కాశీని తలపించే దేవతా విగ్రహాలు ఇక్కడ ఉండటాన్ని గమనించారని చెబుతారు. ఆక్రమంలోనే నీటి కోసం కాశీ, గుహ, భవాని, ఫణికర్ణిక, అయ్యవున అనే దోనెలను సృష్టించారంటారు. శివభక్తులైన చోళరాజులు ఇక్కడి విశిష్టత గుర్తించి క్రీ.శ. 1562లో అన్నపూర్ణసమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించినట్లు ప్రస్తుత ఆలయ ప్రధానార్చకుడు కుప్పయ్యస్వామి తెలిపారు.

ఆలయాల ఆధ్యాత్మిక మాల

బుగ్గ దేవాలయ ప్రాంగణంలో సకల దేవతల ఆలయాలూ ఉన్నాయి. విశ్వేశ్వరుడు, కామాక్షిదేవి, అన్నపూర్ణదేవి, భూనీలాదేవి సమేత ప్రయాగ మాధవస్వామి, కాలభైరవస్వామి, దొంటిగణపతి, సద్యోజాతమూర్తి, వాసుదేవమూర్తి, అఘోరమూర్తి, వళ్లిదేవయాని సమేత సుబ్రమణ్యస్వామి, భక్తకన్నప్ప, దుర్గాదేవి, తత్పురుష మూర్తి, వీరభద్రస్వామి, మహిషాసురమర్థిని, సూర్యనారాయణస్వామి, భక్తాంజనేయస్వామిలు భక్తుల నుంచి పూజలందుకుంటున్నారు.

30ఏళ్లుగా టీటీడీ నిర్వహణ



ఆలయ ప్రాంగణంలో చిన్న దేవాలయాలు

చోళరాజులు, కార్వేటినగరం రాజుల తర్వాత తిరుపతి ఆలయ మహంతులు ఈ ఆలయాన్ని పర్యవేక్షించారు. 1980లో ఆలయాన్ని అభివృద్ధి చేశారు. 1994 నుంచి నిర్వహణ బాధ్యతను తిరుమల తిరుపతి దేవస్థానం తీసుకుంది. శివుడితోపాటు పలు దేవుళ్ల విగ్రహాలు ఉండటంతో శివరాత్రి మాత్రమే కాదు ఏటా ఏకాదశి, వినాయకచవితి, ఆడికృత్తిక, సంక్రాంతి, విజయదశమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అయితే వేసవి తీవ్రత నేపథ్యంలో గతేడాది అక్టోబరులో నవరాత్రి ఉత్సవాలలో రెండు దోనెల్లో మాత్రమే నీరు ప్రవహించిది. స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులు ఈ నీటితో స్నానమాచరించారు. ఈఏడాది శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరోజు ఉదయం నుంచి రాత్రివరకూ ప్రసాద వితరణ ఉంటుందని అర్చకులు తెలిపారు.







డ్రోన్‌ల నుంచి కీచైన్‌ల దాకా..

● ఆకట్టుకుంటున్న టెంపుల్ ఎక్స్‌పో

తిరుపతిలో సోమవారం మొదలైన మూడురోజుల ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో-2025 (ఐటీసీఎక్స్)లో ఏర్పాటుచేసిన పలు రకాల స్టాల్స్ ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యద్వారా వద్ద బంగారుపూతతో మినీ ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. ఆలయాల నిర్వహణలో ఉపకరించే ఆధునిక పరికరాలు, భద్రతకు ఉపయోగపడే ఎలక్ట్రానిక్ పరికరాలు ఈ ప్రదర్శనలో ఉన్నాయి. భారతీయ సంప్రదాయ చేనేత వస్త్రాలు, జానపద సంప్రదాయ చిత్రాలు కూడా ఉఆన్నయి. డ్రోన్‌లు, ఫ్లయింగ్ కెమెరాలు, సీసీ కెమెరాలు, టూవీలర్లూ, కార్లకు క్విక్ చార్జింగ్ యంత్రాలు, మూవింగ్ ఎల్ఈడీ స్ర్కీన్స్ ఈ ప్రదర్శనలో ఆకర్షిస్తున్నాయి.

మిరుమిట్లు గొలిపే కలర్‌ఫుల్ ఎల్ఈడీ లైట్లు, డిజిటల్ లాకర్స్ మొదలు ఆటోమేటిక్ క్లీనింగ్ యంత్రాల దాకా ప్రదర్శనలో చోటు చేసుకున్నాయి.

- తిరుపతి అర్బన్,ఆంధ్రజ్యోతి
















పీజీఆర్ఎస్‌కు 238 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవేంద్రరెడ్డి

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 238 వినతులు వచ్చాయి. అందులో ప్రధానంగా భూసమస్యలపై 161 అర్జీలు ఉన్నాయి. జిల్లాలోని పలు మండలాల నుంచి ప్రజలు హాజరై తమ సమస్యలపై వినతులు సమర్పించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, సుధారాణి, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు వినతులు స్వీకరించారు.

పింఛన్ ఇప్పించండి మహాప్రభో..!

అగ్ని ప్రమాదంలో గాయపడి నడవలేని స్థితికి చేరుకున్నాను. ఎన్నో ఏళ్లుగా వస్తున్న పింఛన్‌ను రెండేళ్ల క్రితం గత ప్రభుత్వం నిలిపివేసింది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నా. కరుణించి పింఛను పునరుద్ధరించండి.



- గురుస్వామి, దివ్యాంగుడు, జీవకోన

గ్రామానికి రోడ్డు వేయండి



30 ఏళ్లుగా గ్రామానికి రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నామని, కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా లాభం లేకపోయిందని వడమాలపేట మండలం వడమాల దళితవాడ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. వెంటనే రోడ్డు ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవించారు.

రోడ్డు కోసం ఆందోళన చేస్తున్న వడమాల దళితవాడవాసులు

తిరుమలలో వేసవి ఉపశమన చర్యలు



వేసవి రాకముందే తిరుమలలో ఎండ మండుతోంది. వారం రోజులుగా చెప్పులు లేకుండా నడవటం ఇబ్బందిగా మారింది. పరిస్థితిని గుర్తించిన టీటీడీ అధికారులు తక్షణ చర్యలను ప్రారంభించారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటితో నేల భాగాన్ని చల్లబరుస్తున్నారు. రానున్న వారం రోజుల్లో పలు ప్రదేశాల్లో చలువ పందిళ్లు వేయనున్నారు. అవసరమైన చోట కూల్ పెయింట్ వేయాలని ఉన్నతాధికారులు సంబంధిత అధికారులను ఆదేశించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణపై అవగాహన

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సొంతంగా ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ చేపట్టనుండడంతో సోమవారం అధికార యంత్రాంగానికి అవగాహన కల్పించారు. అలిపిరి డిపో కార్యలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హైదరాబాదుకు చెందిన వీఎస్ఆర్ అండ్ విజ్ఞానజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఇండ్రస్ట్రియల్ డెవలప్మెంట్ అండ్ రీసెర్చ్ ప్రతినిధి అస్లామ్ అన్సారి, ఆటోమొబైల్ ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ ప్రొఫెసర్లు అంజర్‌ఖార్, రమేష్, హరీష్ హాజరై విద్యుత్ బస్సుల వినియోగంతో కలిగే ప్రయోజనాలు, అనుకూలతలు, మెరుగైన నిర్వహణ వంటి అంశాలను వివరించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఒకే దఫాలో రాష్ట్రానికి 750 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నట్లు తెలుస్తోంది. ఈ సదస్సులో డీపీటీవో జి.నరసింహులు, డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, డీఎంలు బాలాజీ, హరిబాబు, భాస్కర్, పుష్పలత, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎస్వీయూను సందర్శించిన యూఎస్ఏ ప్రతినిధి


తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అమెరికాకు చెందిన పార్డ్యూ యూనివర్సిటీ ప్రతినిధి జూలియానా కస్సవన్ సోమవారం ఎస్వీ యూనివర్సిటీని సందర్శించారు. గతంలో ఎస్వీయూతో పార్డ్యూ వర్సిటీ అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం మేరకు బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో ఈ రెండు వర్సిటీలు పరస్పరం సహకరించుకోనున్నాయి. ఎస్వీయూ ఫిజిక్స్ విభాగాన్ని సందర్శించిన జూలియానా కస్సవన్‌ను ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ దేవప్రసాద రాజు సత్కరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు విజయలక్ష్మి, అపర్ణ, రుద్రమదేవి తదితరులు పాల్గొన్నారు.



జూలియానా కస్సవన్‌ను సత్కరిస్తున్న దేవప్రసాదరాజు

టీటీడీ చైర్మన్ ఫొటో డీపీగా పెట్టుకుని..

● ఎన్ఆర్ఐలను మోసగిస్తున్న కేటుగాడు



తిరుమల సమాచారంతో పేరుతో ఉన్న వాట్సాప్ గ్రూప్

తిరుమల, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడి ఫొటోను వాట్సాప్ ప్రొఫైల్ ఫొటోగా పెట్టుకుని ఎన్ఆర్ఐ భక్తులను మోసగిస్తున్న ఘటన సోమవారం వెలుగుచూసింది. మోసపోయిన కొందరు భక్తులు ఇటీవల టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకి ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెల్లడైంది. హైదరాబాద్‌లోని ఓల్డ్‌సిటీకి చెందిన మహ్మద్ జావెద్ ఖాన్ 'తిరుమల సమాచారం' పేరుతో ఓ వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేసి ఆర్జితసేవలు, వీఐపీ బ్రేక్ టికెట్లు అందుబాటులో ఉన్నాయని గ్రూప్‌లో పోస్ట్ చేస్తూ అందిన వరకు దోచుకుంటున్నాడని విజిలెన్స్ విచారణలో వెల్లడైంది. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని టీటీడీ విజిలెన్స్, పోలీసులను చైర్మన్ బీఆర్ నాయుడు ఆదేశించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు





సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని వస్తున్న కేంద్రమంత్రి శ్రీపాద యశోనాయక్, - కాశీ మఠాధిపతి సమ్యమేంద్రతీర్థ,







మద్రాసు హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వేలుమణి - ఇండియన్ నేవీ మాజీ అధికారి హరి ఓం సింగ్ రాణా - యాంకర్ గీతా భారతి

సెంటు భూమి కూడా అన్యాక్రాంతం కానివ్వం

● మోపూరు అటవీ భూముల్లో 144, 145 సెక్షన్లు ● ఆక్రమణదారులు రాకుండా పోలీసుల పహారా

డక్కిలి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలంలోని మోపూరు సర్వే నెంబరు 1లో ఉన్న అటవీశాఖ భూమి సెంటు కూడా అన్యాక్రాంతం కానివ్వబోమని వెంకటగిరి రేంజ్ ఆఫీసర్ లోకేశ్ స్పష్టం చేశారు. సోమవారం అటవీ భూముల ఆక్రమణ జరుగుతుందని సమాచారం అందడంతో ఆ శాఖ అధికారులతో పాటు పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించారు. సదరు భూముల్లోకి ఎవ్వరూ ప్రవేశించరాదంటూ పోలీసులు 144 సెక్షన్, అటవీశాఖ అధికారులు 145 సెక్షన్ విధించారు. ఈ సందర్భంగా రేంజర్ లోకేశ్ మాట్లాడుతూ గిరిజన సంఘ నాయకులు కొంతమంది స్థానికులను రెచ్చగొట్టి అటవీ భూముల ఆక్రమణను ప్రోత్సహించడం సరికాదన్నారు. రిజర్వు ఫారెస్టు భూములను ఆక్రమిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని గుర్తుచేశారు. కొంతమంది అటవీ భూమును తాము సాగు చేస్తున్నట్లు హైకోర్టును తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. 145 సెక్షన్ మూడు నెలలు పాటు అమల్లో ఉంటుందన్నారు. మోపూరు భూములను గూడూరు డీఎస్పీ గీతాకుమారి పరిశీలించారు. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూడాలని చర్యలు తీసుకోవాలని వెంకటగిరి సీఐ వెంకటరమణకు తగు సూచనలు ఇచ్చారు.



మోపూరు భూముల్లో అటవీశాఖ, పోలీసు అధికారులు

తాళాలు పగలగొట్టి చోరీ

9 సవర్ల బంగారం, రూ.55 వేల నగదు అపహరణ



ఇంట్లో చెల్లా చెదురుగా పడివున్న వస్తువులు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణం కుమ్మరివీధిలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. బాధితుల కథనం మేరకు... ఇంటి యజమాని పురుషోత్తం కుటుంబసభ్యులతో కలిసి శనివారం ఉదయం తిరుణ్ణామలై వెళ్లారు. దైవ దర్శనం అనంతరం ఆదివారం రాత్రి తిరిగి వస్తుండగా కుమ్మరివీధిలో స్థానికులు ఫోన్‌చేసి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయని చెప్పడంతో పురుషోత్తం 100కు సమాచారం ఇచ్చాడు. వెంటనే పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని పరిశీలించగా తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న వస్తువులు, దుస్తులను చెల్లాచెదరుగా పడేసి ఉన్నాయి. ఇంటికి చేరుకున్న పురుషోత్తం 9 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.55వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విశిష్ట గుర్తింపు సంఖ్యతో రైతులకు ఎన్నో లాభాలు

కోట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతూ విధిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి నిరంజన్ కుమార్ కోరారు. తహసీల్దారు కార్యాలయంలో సోమవారం సహాయ వ్యవసాయ అధికారులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో నిరంజన్‌కుమార్ మాట్లాడుతూ స్వంత భూమి కలిగిన రైతులందరికీ విశిష్ట గుర్తింపు సంఖ్యను ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించడం జరిగిందన్నారు. ఇందుకోసం ఆధార్ నెంబరు, పట్టాదారు పాస్ పుస్తకం, ఫోన్ నెంబరుతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. విశిష్ట గుర్తింపు సంఖ్య ఉంటేనే రైతులకు పంటల బీమా, పీఎం కిసాన్, పంట నష్ట పరిహారం, అన్న దాత సుఖీభవ, వ్యవసాయ యంత్ర పరికరాల రాయితీలు పొందవచ్చన్నారు. సమావేశంలో తహసీల్దారు జయజయరావు, ఆర్ఐ మధులత పాల్గొన్నారు.

ప్రతి అర్జీనీ పరిష్కరించాలి

కోట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్‌లో అందే ప్రతి అర్జీకి సంబంధిత అధికారులు పరిష్కారం చూపాలని తహసీల్దారు జయజయరావు అన్నారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో గ్రీవెన్స్ నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. పలు సమస్యలపై శాఖల వారీగా అధికారులతో చర్చించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో వేణు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

జీబీఎస్ వైరస్‌పై ఆందోళన వద్దు

పెళ్లకూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జీబీఎస్(గులియన్ బారే సిండ్రోమ్) వ్యాధిపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పెళ్లకూరు పీహెచ్‌సీ వైద్యాధికారి సుజాతమ్మ అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ జీబీఎస్ లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. జలుబు, జ్వరం, దగ్గు, విరోచనాలు, వాంతులు వచ్చినా, తిమ్మెర్లు, నరాలు, కండరాలు లాగినట్లు అనిపించినా ఆస్పత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించాలని కోరారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం ఉదయం రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడు మృతి చెందాడు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, వయస్సు 25 సంవత్సరాలు ఉంటా యని రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తర లించారు. ప్రమాదశాత్తు మృతి చెందాడా, లేక ఆత్మహత్య చేసు కున్నాడా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని మోటారు సైక్లిస్టుకు గాయాలు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పండ్లూరు జాతీయ రహదారి సమీపంలో మోటారు సైకిల్‌ను కారు ఢీకొన్న సంఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. కలిపేడు గ్రామానికి చెందిన వెంకయ్య మోటారు సైకిల్‌పై నాయుడుపేట వైపు వెళ్తుండగా పండ్లూరు జంక్షన్ వద్ద చెన్నై వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకయ్యకు గాయాలవడంతో 108 వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు.

పరిసరాల శుభ్రతతో అంటువ్యాధులు దూరం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతతోనే అంటువ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చని ప్రభుత్వాస్పత్రి వైద్యుడు డాక్టర్ రమేష్ అన్నారు. సోమవారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బందితో కలిసి ఆస్పత్రి పరిస రాల్లో చెత్తను తొలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ నివాస, ఉద్యోగ ప్రదేశ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆహ్లాదకరమైన, మనస్సుకు సానుకూలత వాతావరణం లభిస్తుందన్నారు. అంతకుముందు వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఆనంద్, సుధీర్, రజనీ తదితరులు పాల్గొన్నారు.





కాళంగి నదిని అనుకొని ఉన్న డంపింగ్ యార్డు - కుదిరి చెరువులో వ్యర్థాలు

కాళంగిని కాటేస్తున్న కాలుష్యం

- డంపింగ్ యార్డు నుంచి నదిలోకి వ్యర్థాలు
- కలుషితమవుతున్న నీరు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజక వర్గంలో వేలాది ఎకరాలకు సాగు నీరందించే రైతుల వరప్రసాదిని కాళంగి నది కాలుష్య కోరల్లో చిక్కుకొంది. ఐదేళ్ల వైసీపీ పాలనలో అక్రమ ఇసుక తవ్వకాలతో కరిగిపోయి భూగర్భ జలాలు అడుగంటిన కాళంగిని నేడు కాలుష్యం కారణంగా నీరంతా కలుషితమై ప్రమాదంలో పడింది. తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో రైతులు కాళంగి నీటిపై ఆధారపడి వేలాది ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. అలాగే వేసవిలో భూగర్భజలాలు అడుగంటినప్పుడు సూళ్లూరుపేట పట్టణ తాగునీటి అవసరాలను కాళంగి నది తీర్చుతోంది. దీనికి అనుసంధానంగా ఉన్న నెర్రికాలువ, పాముల కాలువ, పుచ్చాకాలువల గుండా దాదాపు 18 చెరువులకు సాగునీరు అందుతోంది. జిల్లాలోని కాళంగి నుంచి ప్రారంభమయ్యే నది బీఎన్ కండ్రిగ మండలం మీదుగా ప్రవహించి సూళ్లూరుపేట పట్టణ నడిబొడ్డున సాగుతూ తడ మండలం వాటంబేడు వద్ద ముగిస్తుంది. సూళ్లూరుపేట పట్టణంలోని హోలిక్రాస్ సమీపంలో కాళంగిని ఆనుకొని డంపింగ్ యార్డు ఉంది. పట్టణంలో వినియోగించే తడి, పొడి చెత్త వేలాది టన్నులు డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఈ చెత్తంతా నదిలోకి జారీ నీరు కలుషితం అవుతోంది. సాగు, తాగునీటికి ఉపయోగించే కాళంగి నీరు రంగు మారిపోయి ప్రమాదకర స్థాయికి చేరింది. దీనికి తోడు వాటంబేడు వద్ద పులికాట్‌కు, కాళంగికి మధ్య ఉన్న గ్రాయిన్ దెబ్బతినడంతో భూగర్భ జలాలు ఉప్పుగా మారిపోతున్నాయి. దీంతో సాగునీరందక రైతులు లబోదిబోమంటున్నారు. డంపింగ్ యార్డును కాళంగి నది ప్రాంతం నుంచి తరలించాలని అనేకసార్లు విన్నవించుకొన్నా అధికారులు, ప్రజాప్రతినిధుల్లో చలనం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులకు స్పందించి కాళంగి నదిని కాలుష్య కోరల్లో నుంచి రక్షించాలని రైతులు, పట్టణ వాసులు కోరుతున్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకుని, పాత చట్టాన్ని కొనసాగించాలని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఇన్సాఫ్ సమితి ఆధ్వర్యంలో ప్రజాసంఘాల నాయకులు ధర్నా నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజులకాలంలో ముస్లింలకు దానం చేసిన ఆస్తులను వక్ఫ్ సవరణ చట్టంతో సొంతం చేసుకునేందుకు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రయత్నాలు సాగిస్తోందన్నారు. మతాలకు అతీతంగా పాలన అందించాల్సిన పాలకులు మతవిద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యవహరించడం దారుణమన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలేషా, నాశిన భాస్కర్ గౌడ్, మగ్దూం, జాహీద్, విజయ్ కుమార్, జమాలుల్లా, శశికుమార్, శివ కుమార్, ఎల్‌వీ సుబ్బయ్య, జిలానీబాషా, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.





సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయండి



గూడూరు ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ సిబ్బంది నిరసన

గూడూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ సిబ్బంది చేపట్టిన 42రోజుల సమ్మె కాలంలో జరిగిన ఒప్పందాలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీఐటీయూ నాయకులు అన్నారు. సోమవారం గూడూరు ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా, సీడీపీవో మెహబూబీలకు వినతిపత్రాలు అందజేశారు. యూనియన్ అధ్యక్షురాలు ఇందిరమ్మ, కార్యదర్శి ప్రభావతి, మంగమ్మ, మణికుమారి, విజయలక్ష్మి, ప్రసన్న, వెంట్రామిరెడ్డి, శివకుమార్, బీవీ రమణయ్య, సురేష్, ప్రసాద్, చంద్రయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోట: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన అంగన్‌వాడీ వర్కర్లు తమ సమస్యలను పరిష్కరించాలంటూ నిరసన తెలిపారు. అక్కడ నుంచి కోట బజారు సెంటర్‌లో ర్యాలీ నిర్వహిం చారు. అంగన్‌వాడీ అసోసియేషన్ అధ్యక్షురాలు పద్మలీ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి మునిరాజ, నాయకులు ముకుంద, శ్యామలమ్మ, కళావతి, పుష్పలత, దుర్గమ్మ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యాన్ని ఆదరించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్యాంధన్

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి ప్రసాదించిన ఆయుర్వేద వైద్యానికి ఆదరణను పెంచేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆయుర్వేద వైద్యుడు శ్యాంధన్ అన్నారు. సోమవారం మండలంలోని చెన్నూరు బీసీ కాలనీలో ఆయుర్వేద వైద్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేదం వైద్యం ద్వారా దీర్ఘకాలిక రోగాలు సైతం నయమవుతాయన్నారు. ఆయుర్వేదం విశిష్టతను విద్యార్థులకు తెలియజేసేందుకు 8వ తరగతి నుంచి పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం మహాసిద్ధ మూలికా వైద్య పాఠశాల సభ్యుల ఆధ్వర్యంలో డాక్టర్ నారాయణను సన్మానించారు. కార్యక్రమంలో సువర్ణకుమారి, పెంచలయ్య, బాబు, శంకర్, ఆదినారాయణ, మహేంద్రబాబు, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష తులసిపూజ



లక్ష తులసీపూజ నిర్వహిస్తున్న భక్తులు

గూడూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాజీ నగర్‌లోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో 16వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం హోమం చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ లక్ష తులసిపూజను శాస్త్రోపేతంగా జరిపారు. ఉభయకర్తలుగా ముప్పాళ్ల మురళీమోహన్‌రాజు, వాసుదేవరాజు కుటుంబసభ్యులు వ్యవహరించారు. పొణకా శివకుమార్‌రెడ్డి, దేవసేనమ్మ కుటుంబసభ్యుల దాతృత్వంతో ఆలయ ఆవరణలో మధ్యాహ్నం అన్నదానం చేశారు.

సేవింగ్స్‌పై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ నరేంద్ర

కోట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ డిగ్రీ కళాశాలలో సోమవారం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీ మార్కెట్ సంస్థ ఆధ్వర్యంలో సేవింగ్స్‌పై సదస్సు నిర్వహించారు. ఆ సంస్థ రీసోర్స్ పర్సన్ డాక్టర్ నరేంద్ర సేవింగ్ వల్ల భవిష్యత్తులో కలిగే ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, కోఆర్డినేటర్ రాజేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.





సీఎం చంద్రబాబుకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల, పుష్పగుచ్ఛం అందజేస్తున్న విజయశ్రీ

సీఎంను కలిసిన ఎమ్మెల్యేలు

సూళ్లూరుపేట, డక్కిలి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో(ఐటీసీఎక్స్)లో పాల్గొనేందుకు సోమవారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న సీఎం చంద్రబాబునాయుడిని సోమవారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ రేణిగుంట విమానాశ్రయంలో కలిశారు.

సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కుదిరి గ్రామంలో రూ.8 లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్డు నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్లెల్లో ప్రతి వీధిలో సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహాలు మంజూరు చేస్తామన్నారు. అంతకుముందు ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు గురుకుల సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు గురుకల కృష్ణయ్య, పర్వత రెడ్డి చంద్రారెడ్డి, వేనాటి మురళీరెడ్డి, వై.సతీష్, హనుమంత శ్రీనివాసు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను విలీనం చేస్తే ఉద్యమిస్తాం



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న విద్యాకమిటీ చైర్మన్ సునీత, మాజీ ఎంపీటీసీ చెంగల్‌రావు

కోట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వావిళ్లదొరువు గ్రామంలో ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను కొత్తపట్నం పాఠశాలలో విలీనం చేసే ప్రయత్నాలు ఆపకపోతే ఉద్యమిస్తామని పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ సునీత, మాజీ ఎంపీటీసీ చెంగల్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రెవెన్యూ, విద్యాశాఖ కార్యాలయాల ఎదుట గ్రామస్తులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దారు జయజయరావు, ఎంఈవో మస్తానయ్యకు వినతిపత్రాలు అందజేశారు. వావిళ్లదొరువు ప్రాథమిక పాఠశాల తరగతులను కొత్తపట్నం పాఠశాలలోని విలీనం చేస్తే విద్యార్థులు ఒకటిన్నర కిలోమీటరు నడిచి వెళ్లాల్సి ఉంటుందన్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పాఠశాల విలీనాన్ని ఆపాలని కోరారు.

ఇసుక రీచ్‌లో స్థానికులకు పని కల్పించాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గూడలి గ్రామస్తులు

గూడూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలి గ్రామంలో ఉన్న ఇసుక రీచ్‌లో స్థానికులకు పని కల్పించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్ అన్నారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద గూడలి గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడలి సమీపంలోని ఇసుకరీచ్‌లో యంత్రాలతో పనులు చేయిస్తుండడంతో స్థానికులు ఉపాధి లేకుండా పోతుందన్నారు. స్థానికులకు పని కల్పించి జీవనోపాధిని మెరుగుపరచాలన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకటయ్య, సుబ్రహ్మణ్యం, రవి, నాగయ్య, ప్రభావతి, గోవిందమ్మ పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ విశిష్ట గుర్తింపు సంఖ్య

వాకాడు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు పారదర్శకంగా సేవలను అందించేందుకు విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయించనున్నట్లు వ్యవసాయశాఖ అధికారిణి దీప తెలిపారు. సోమవారం వాకాడులోని రైతు భరోసా కేంద్రంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపడుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ ద్వారా రైతు భూముల వివరాలను నమోదు చేసుకున్నాక 11అంకెలతో విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయించడం జరుగుతుందన్నారు. ఈసంఖ్య ఉంటేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు, రాయితీలు, బీమా వంటి ప్రయోజనాలు పొందవచ్చన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ

ఓజిలి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బందికి సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్(సాల్ట్) కార్యక్రమంలో భాగంగా మంగళవారం నుంచి రెండు విడతల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంఈవో శైలజ తెలిపారు. జ్ఞానజ్యోతి సర్టిఫికెట్ కోర్సులో భాగంగా అంగన్‌వాడీల్లోని కిందస్థాయి సిబ్బందికి రాష్ట్ర పాఠశాల విద్య, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ అధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. మొదటి విడతగా మంగళవారం నుంచి 20వ తేదీ వరకు, రెండో విడత 21నుంచి 24వ తేదీ వరకు ఓజిలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ తరగతులు ఉంటాయన్నారు.